ఏలూరు ఉష్ణోగ్రతలు
గరిష్ఠం : 33.0
కనిష్ఠం : 27.0

ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
ఏలూరు
జిల్లా వార్తలు

సోమవారం 19 ఆగస్టు 2024


మంత్రి లోకేశ్‌కు వినతిపత్రం అందజేస్తున్న ఏపీపీఆర్ ఇంజనీరింగ్ టెక్నికల్ అసిస్టెంట్ల సంఘం అధ్యక్షుడు సురేష్‌కుమార్ (ఫైల్)

మా గోడు.. వినండి!

జిల్లాలో పంచాయతీరాజ్, ఇంజనీరింగ్ విభాగంలో విధులు నిర్వహిస్తున్న టెక్నికల్ అసిస్టెంట్లు 18 నెలలుగా జీతాలు లేక ఆర్థికంగా తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. మరోవైపు హౌసింగ్ విభాగం అవుట్ సోర్సింగ్ ఉద్యోగులు సైతం తమ సమస్యలు పరిష్కరించాలని కూటమి ప్రభుత్వాన్ని కోరుతున్నారు. గత వైసీపీ ప్రభుత్వం తమకు తీవ్ర అన్యాయం చేసిందని ఆయా విభాగాల ఉద్యోగులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

కూటమి ప్రభుత్వం పైనే కోటి ఆశలు

- గత వైసీపీ సర్కార్ మా సమస్యలను పట్టించుకోలేదు..
- మా శ్రమకు తగ్గ గుర్తింపు ఇవ్వలేదు
- పంచాయతీరాజ్ టెక్నికల్ అసిస్టెంట్లు, హౌసింగ్ విభాగం అవుట్ సోర్సింగ్ ఉద్యోగుల ఆవేదన

అర్హతను బట్టి రెగ్యులర్ చేయండి..

ఏలూరు రూరల్, ఆగస్టు 18 : ఏళ్ల నుంచి శ్రమిస్తున్నాం. గృహ నిర్మాణాల పురోగతికి పాటు పడుతు న్నాం. అయినా మా శ్రమకు తగిన ఫలితం, గుర్తింపు లేదు. గత వైసీపీ ప్రభుత్వం మమ్మల్ని పూర్తిగా నిర్లక్ష్యం చేసింది. కూటమి ప్రభుత్వమైనా మా మొరను ఆలకించి న్యాయం చేయాలని హౌసింగ్ విభాగం అవుట్ సోర్సింగ్ ఉద్యోగులు కోరుతున్నారు. తమకు టైమ్‌స్కేల్ ప్రకటించాలని, ఎన్ఎంఆర్‌లుగా అయినా పరిగణించాలని కోరుతున్నారు. ఉమ్మడి, పశ్చిమ గోదావరి జిల్లా హౌసింగ్ విభాగంలో పనిచేసేవారితో పాటు రాష్ట్రవ్యాప్తంగా 2 వేల మందికి పైగా అవుట్‌సోర్సింగ్ ఉద్యోగులు కూటమి ప్రభుత్వంపై కోటి ఆశలు పెట్టుకున్నారు. గృహ నిర్మాణశాఖలో ఖాళీగా రెగ్యులర్ పోస్టులు ఉన్నాయి. వాటిని భర్తీచేసి టైమ్‌స్కేల్ వర్కర్లు, ఎన్ఎంఆర్‌లుగా ప్రకటించే కంటే క్రమబద్ధీకరించాలని విజ్ఞప్తి చేస్తున్నారు. డేటా ఎంట్రీ ఆపరేటర్లు, వర్క్ ఇన్‌స్పెక్టర్లుగా 2006 నుంచి పని చేస్తున్నారు. వారికి ఎటువంటి ఉద్యోగ భద్రత లేదు. గృహ నిర్మాణ సంస్థలో మొదటి దశలో నియమించి 16 ఏళ్ల నుంచి రెగ్యులర్ ఉద్యోగులతో సమానంగా పనిచేస్తున్నారు. సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని కోరినా గత ప్రభుత్వం పట్టించుకోలేదని, బండెడు చాకిరీ చేయించిన వైసీపీ ప్రభుత్వం తమ విన్నపాన్ని కనీసం వినలేదని, ప్రస్తుతం ఒక్కొక్కరికి 45 ఏళ్ల దాటాయని వేరే ఉద్యోగం చేసే అర్హత కోల్పోతున్నామని గృహ నిర్మాణశాఖలోనే రెగ్యులర్ చేయాలని కూటమి ప్రభుత్వాన్ని కోరుతున్నారు.

ఇవి డిమాండ్లు ..

ఐదు నుంచి పదేళ్ల పైబడి పనిచేస్తున్న వారందరిని అర్హతను బట్టి ఖాళీ పోస్టుల్లో భర్తీ చేయాలి. మినిమం టైంస్కేల్ ఇప్పించాలి. ఉద్యోగ భద్రత కల్పించాలి. వర్క్‌ఇన్‌స్పెక్టర్లుగా రవాణా భత్యం కల్పించాలి. అవుట్‌సోర్సింగ్ వర్క్ ఇన్‌స్పెక్టర్లు, డీటీపీ ఆపరేటర్లకు మినిమం టైంస్కేల్, ఎన్ఎమ్ఆర్ లేదా హెచ్ఆర్ పాలసీ కల్పించాలి. హెల్త్‌కార్డు, ఈఎస్ఐ ద్వారా ఆరోగ్యభద్రత కల్పించాలి. ఉద్యోగం చేస్తూ మరణిస్తే వారి కుటుంబసభ్యులకు ఉద్యోగం కల్పించాలి. అవుట్ సోర్సింగ్ ఉద్యోగులకు ఎక్స్‌గ్రేషియా మంజూరు చేసి ప్రభుత్వ పథకాలు వర్తింప చేయాలని ఏలూరు జిల్లా గృహనిర్మాణ సంస్థ అవుట్‌సోర్సింగ్ ఉద్యోగుల సంఘ నాయకులు కోరుతున్నారు.

18 నెలలుగా జీతాల్లేవ్...

కూటమి ప్రభుత్వం ఆదుకోవాలి

అర్హత ఉన్నవారిని ఇంజనీరింగ్ అసిస్టెంట్లుగా నియమించాలి. కోర్టు ఆదేశాల మేరకు విధుల్లో కొనసాగించాలి. ఖాళీగా ఉన్న పోస్టుల్లో ఏఈలు, జూనియర్ టెక్నికల్ అసిస్టెంట్లుగా నియమించాలి. 18 నెలల బకాయి జీతాలు చెల్లించాలి. కూటమి ప్రభుత్వమే ఆదుకోవాలి.

- సురేష్‌కుమార్, ఏపీపీఆర్ ఇంజనీరింగ్ టెక్నికల్ అసిస్టెంట్ల సంఘం అధ్యక్షుడు

జిల్లాలో పంచాయతీరాజ్, ఇంజనీరింగ్ విభాగంలో విధులు నిర్వహిస్తున్న టెక్నికల్ అసిస్టెంట్ల పరిస్థితి దయనీయంగా మారింది. గత వైసీపీ ప్రభుత్వం నిర్వాకంతో జిల్లాలో సుమారు 50 మందికి పైగా టెక్నికల్ అసిస్టెంట్లకు 18 నెలలుగా జీతాలు అందడం లేదు. ప్రస్తుతం కూటమి ప్రభుత్వంపైనే వారు ఆశలు పెట్టుకున్నారు. 2014లో అప్పటి టీడీపీ ప్రభుత్వ హయాంలో ఉపాధి హామీ పథకంలో భాగంగా కొంతమంది సైట్ ఇంజినీర్లు, టెక్నికల్ అసిస్టెంట్లను నియమించారు. ఆప్కాస్ నుంచి వేతనాలు అందేవి. గత వైసీపీ ప్రభుత్వం వేతనాలు చెల్లించకుండా తీవ్ర జాప్యం చేసింది. టెక్నికల్ అసిస్టెంట్లు, సైట్ ఇంజనీర్లకు పరిపాలనా నిధుల్లో మూడు శాతం వేతనాల కింద చెల్లించాలని, నిబంధనలు పెట్టింది. కాగా గత ఐదేళ్లల్లో మూడుశాతం నిధులు మంజూరు కాకపోవడంతో వారు సీఎం కార్యాలయానికి వెళ్లారు. అయితే టీడీపీకి చెందిన వారే అధికంగా ఉన్నారని, మీ అవసరం మాకు లేదని అక్కడ సిబ్బంది చెప్పడంతో వారంతా ఆశ్చర్యపోయారు.


నూజివీడులో మంత్రి పార్థసారథికి ఇటీవల వినతిపత్రం అందజేస్తున్న హౌసింగ్ అవుట్ సోర్సింగ్ ఉద్యోగులు

కక్ష కట్టిన వైసీపీ సర్కార్

టీఏలుగా విధులు నిర్వహిస్తున్న వారికి అర్హత మేరకు సచివాలయ పరిధిలోనే ఇంజనీరింగ్ అసిస్టెంట్‌లుగా నిబంధనల మేరకు నియమించాలని కొంతమంది రాష్ట్ర నాయకులు ఉన్నత న్యాయస్థానాన్ని ఆశ్రయించారు. దీనిని తట్టుకోలేక వైసీపీ ప్రభుత్వం వారిపై కక్ష కట్టింది. నియామకాలు చేపట్టకపోగా వారిని విధుల నుంచి తొలగించాలని ఆదేశాలు జారీ చేసింది. దీంతో టీఏలు కోర్టుకు వెళ్లగా న్యాయస్థానం అనుకూల తీర్పుతో విధులు నిర్వహిస్తున్నారు. కాని వైసీపీ సర్కార్ కొన్నినెలలుగా వేతనాలు చెల్లించలేదు. ఇదిలా ఉండగా విధులు నిర్వహిస్తున్న టీఏలకు గత రెండేళ్లుగా ఈఎస్ఐ, ఈపీఎఫ్‌కు సంబంధించి వాటాను ఆప్కాస్‌కు చెల్లించలేదు. పంచాయతీరాజ్‌శాఖకు టెక్నికల్ అసిస్టెంట్లు అవసరమని 2023 లో ప్రత్యేక కమిటీ సిఫార్సులు సైతం గత ప్రభుత్వం పక్కన పెట్టింది. ఈ క్రమంలో ఆర్థిక ఇబ్బందులు భరించలేక ఇద్దరు టీఏలు మృతి చెందా రు. ఇటీవల రాష్ట్రమంత్రులు నారా లోకేశ్, పవన్ కల్యాణ్‌లను కలిసి వైసీపీ హయాంలో ఎదుర్కొన్న సమస్యలను పరిష్కరించాలని, వేతనాలు పూర్తిస్థాయిలో అందించాలని, సిబ్బందికి హెడ్ ఆఫ్ అకౌంట్ ద్వారా జీతాలు చెల్లించాలని, ఉద్యోగ భద్రతకు చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు.

జంగారెడ్డిగూడెం మునిసిపాలిటీలో..

రూ. కోటి ముప్పై లక్షలు నొక్కేశారు..

- సిల్ట్ తొలగింపు పేరిట అవినీతి..
- స్వపార్టీ నాయకులపై వైసీపీ నాయకుడు వందనపు వెంకటేశ్వరరావు ఆరోపణలు


వందనపు వెంకటేశ్వరరావు

జంగారెడ్డిగూడెం, ఆగస్టు 18 : జంగారెడ్డిగూడెం మునిసిపాలిటీపై రోజు రోజుకు అవినీతి ఆరోపణలు పెరుగుతున్నాయి. ప్రస్తుతం వైసీపీ పాలకవర్గం కొనసాగుతుండగా తొలుత నుంచి అవినీతి ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఇప్పుడు సాక్షాత్తు గత వైసీపీ ప్రభుత్వంలో కీలక పదవులు అనుభవించిన స్థానిక వైసీపీ నాయకుడు, జంగారెడ్డిగూడెం సొసైటీ మాజీ అధ్యక్షుడు వందనపు వెంకటేశ్వరరావు మునిసిపాలిటీలో కోట్ల రూపాయల అవినీతి జరిగిందని బహిరంగంగా విమర్శించిన వీడియోలు సోషల్ మీడియాలో చక్కర్లు కొడుతున్నాయి. పట్టణంలో డ్రెయినేజీలపై రాళ్లు తొలగించి సిల్ట్ తొలగింపు పేరిట రూ.కోటి ముప్పై లక్షల అవినీతి జరిగిందని ఆయన ఆరోపిస్తున్నారు. గత ప్రభుత్వంలోని అప్పటి ప్రజా ప్రతినిధులపైనా సైతం ఆరోపణలు చేయడం స్థానికంగా సంచలనం రేపింది. దీంతో మునిసిపాలిటీలో ఇంకెంత ప్రజాధనాన్ని ఎవరెంత బొక్కేశారో అంటూ విమర్శలు వ్యక్తమవుతున్నాయి. గత వైసీపీ ప్రభుత్వంలోనే ఇక్కడ పనిచేసిన కమిషనర్ శ్రావణ్ కుమార్‌పై టౌన్ ప్లానింగ్‌లో అవినీతి ఆరోపణలు రాగా కౌన్సిలర్లు నిరసన వ్యక్తం చేయ డంతో ఆయనపై ఉన్నతాధికారులు విచారణ చేపట్టి ఇక్కడ నుంచి వేరే చోటికి పంపారు. జిల్లాలోనే జంగారెడ్డిగూడెం మున్సిపాలిటీ ఆదాయంలో, భౌగోళికంగా, జనాభా పరంగా పెద్దదిగా ఉంది. పట్టణంలో సమస్యలూ అధికంగానే ఉన్నాయి. ఏటా సుమారు రూ.10 కోట్లు మునిసిపాలిటీకి ఆదాయం వస్తుంది. ఈక్రమంలో మునిసిపాలిటీలో ప్రజాధనం ఏదో రూపంలో దుర్వినియోగం అవుతూనే ఉందన్న ఆరోపణలున్నాయి. కూటమి ప్రభుత్వమైనా ప్రజాధనం దుర్వినియోగం కాకుండా చూడాలని పట్టణవాసులు కోరుతున్నారు.

నేడు సర్‌ప్లస్ టీచర్లకు వర్క్ అడ్జస్ట్‌మెంట్ కౌన్సెలింగ్ ?

ఏలూరు అర్బన్, ఆగస్టు 18 : పలు అభ్యంతరాలు, సవరణలతో వాయిదా పడుతూ వస్తున్న సర్‌ప్లస్ టీచర్ల వర్క్ అడ్జస్ట్‌మెంట్ కౌన్సెలింగ్‌ను సోమవారం చేపట్టేందుకు విద్యాశాఖ మరోసారి సమాయత్త మవుతోంది. ఈ మేరకు ఆదివారం ఉన్నతాధికారుల నుంచి వర్తమానం అందడంతో పాటు, ఫైనల్ సీనియార్టీ జాబితాలను ఏ సమయంలోనైనా విద్యాశాఖకు పంపిస్తారని సమాచారం వచ్చింది. ఈ జాబితాల ప్రకారమే సోమవారం సాయంత్రం 5గంటల తర్వాత మండలాల్లో కౌన్సెలింగ్ నిర్వహించే అవకాశం ఉంది. కాగా ఇప్పటికీ క్షేత్రస్థాయిలో పలు అభ్యంతరాలు అపరిష్కృతంగానే వున్నట్టు సమాచారం. ముఖ్యంగా ఉర్దూ విద్యార్థులున్న పాఠశాలల్లో సర్‌ప్లస్ సమస్య తలెత్తితే అక్కడ తెలుగు ఎస్జీటీ పోస్టును మిగులు టీచరుగా చూపించడంపై అభ్యంతరాలు తలెత్తుతున్నాయి. వాస్తవానికి స్కూలులో ఇద్దరు, ముగ్గురు ఉర్దూ పిల్లలున్నా అక్కడ విద్యార్థుల సంఖ్యతో నిమిత్తం లేకుండా ఉర్దూ టీచరు పోస్టును కొనసాగించాలి. అదేసమయంలో అక్కడి స్కూలులో తెలుగు, ఉర్దూ ఎస్జీటీ పోస్టులుండి, సర్‌ప్లస్ సమస్య తలెత్తిన సందర్భాల్లో నిబంధనల ప్రకారం ఉర్దూ పోస్టును మిగులు జాబితాలో చేర్చేం దుకు సాంకేతి కంగా అవకాశం లేకపోవడంతో అక్కడ తెలుగు ఎస్జీటీ పోస్టును సర్‌ప్లస్‌గా చూపించడంవల్ల సంబంధిత ఉపాధ్యా యునికి స్థాన భ్రంశంతో నష్టపోయే పరిస్థితులున్నట్టు చెబుతున్నారు. జిల్లాలో ప్రతీ మండలంలో కనీసం రెండు లేదా మూడు ఎస్జీటీ పోస్టులకు ఈ తరహా సమస్య ఏర్పడినట్టు సమాచారం. ఇక ప్రాథమికోన్నత పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య, నిష్పత్తి విషయంలో ప్రభుత్వం కొంత వెసులుబాటు, సడలింపులు ఇవ్వడంతో జిల్లాలో ఇప్పుడున్న సర్‌ప్లస్ టీచర్ల సంఖ్య కొంతమేర తగ్గుతుందని భావిస్తు న్నారు. దీనిపై అధికారికంగా ఫైనల్ సీనియార్టీ జాబితాలు వస్తేగాని స్పష్టత వచ్చే అవకాశాలు లేవు. మరోవైపు సోమవారం జిల్లావ్యాప్తం గా అన్ని మండలాల్లో స్కూల్ కాంప్లెక్స్ సమావేశాలకు ఉపాధ్యాయులు హాజరుకానున్న నేపథ్యంలో అదేరోజున సర్‌ప్లస్ టీచర్ల వర్క్ అడ్జస్ట్‌మెంట్ కౌన్సెలింగ్‌ను ఎలా చేపడతారోనన్న డోలాయమానం విద్యాశాఖ వర్గాల్లో నెలకొంది. ఇటీవల ఉపాధ్యాయ సంఘాలతో ఉన్నతాధికారులు జరిపిన సమావేశంలో అంగీకరించిన అంశాలపై సవరణలతో కూడిన మార్గదర్శకాలు ఆదివారం సాయంత్రం వరకు విడుదల కాలేదు. ఈ నేపథ్యంలో పని సర్దుబాటు కౌన్సెలింగ్ మరో రోజుకి వాయిదాపడే అవకాశాలు లేకపోలేదు.


పంచగవ్యప్రోక్షణ జరుపుతున్న అర్చకులు, రుత్వికులు

నేత్రపర్వం..పవిత్రాధివాసం

ద్వారకాతిరుమల, ఆగస్టు 18: చినతిరుమలేశుని దివ్య పవిత్రోత్సవాల్లో భాగంగా ఆదివారం ఆలయంలో జరిగిన పవిత్రాధివాసం భక్తులకు నేత్రపర్వమైంది. ఉదయం ఆలయంలో విష్వక్సేనపూజ, పుణ్యాహవాచన, అగ్ని ప్రతిష్ఠాపన, పవిత్రాలకు పంచగవ్య ప్రోక్షణ, అభిమంత్రణ, ఉత్సవమూర్తుల వద్ద పవిత్రాలను ఉంచి పంచశ యనాది వాసాన్ని వేదమంత్రోచ్ఛరణలతో అర్చకులు, రుత్వికులు వైభవోపేతంగా జరిపారు. మహా శాంతి హోమాలు జరిగాయి. ఆలయంలో చతుర్వేద పారాయణలను నిర్వహించారు.

విద్యార్థినులతో అసభ్య ప్రవర్తన.. టీచర్ సస్పెన్షన్

చింతలపూడి, ఆగస్టు 18 : స్థానిక జిల్లా పరిషత్ బాలికల పాఠశాలలో బయాలాజికల్ సైన్స్ టీచర్‌గా పనిచేస్తున్న వి.సంపత్ కుమార్‌ను సస్పెండ్ చేసినట్టు డీఈవో అబ్రహం తెలిపారు. పాఠశాలలోని విద్యార్థినులతో అసభ్యంగా ప్రవర్తిస్తున్నట్టు ఫిర్యాదు అందడంతో ప్రాథమిక విచారణ జరిపి సస్పెండ్ చేశామని, పూర్తిస్థాయి విచారణకు ఆదేశించినట్టు ఆయన తెలిపారు.


పునః ప్రారంభానికి సిద్ధంగా ఉన్న కొండంగి 1, 2 ఎత్తిపోతల పథకాలు

కొండంగి 1, 2 ఎత్తిపోతల పథకాలు రేపు పునః ప్రారంభం

కలిదిండి, ఆగస్టు 18 : ఉప్పుటేరులో ఉప్పు నీరు తీపి పడడంతో ఈ నెల 20న కొండంగి 1, 2 ఎత్తిపోతల పథకాలను పునఃప్రారంభించనున్నారు. ఏప్రిల్‌లో ఉప్పుటేరులోకి సముద్ర ఉప్పు నీరు చొచ్చుకు రావడంతో ఎత్తిపోతల పథకాల నీటి సరఫరాను నిలుపుదల చేశారు. ఆక్వా రైతులు సాగునీటి కోసం అవస్థలు పడ్డారు. చెరువుల్లో నీటి మట్టం తగ్గిపోవడంతో చేపల ఎదుగుదల లేక నష్టాల పాలయ్యారు. సాగునీరు లేకపోవడంతో చేపల, రొయ్యల చెరువులు ఖాళీగా దర్శనమిస్తున్నాయి. కొండంగి 1, 2 ఎత్తిపోతల పథకాల ద్వారా సుమారు 20 వేల ఎకరాలకు సాగునీరు అందుతుంది. 2015లో టీడీపీ హయాంలో అప్పటి మంత్రులు కామినేని శ్రీనివాస్, దేవినేని ఉమామహేశ్వరరావు, ఎంపీ మాగంటి బాబు సుమారు రూ.13 కోట్లతో కొండంగి 1, 2 ఎత్తిపోతల పథకాలను ఏర్పాటు చేశారు. పంట కాల్వలకు సాగునీటి కొరత ఏర్పడినప్పుడల్లా ఈ ఎత్తిపోతల పథకాలు రైతులను ఆదుకుంటున్నాయి. 2019లో వైసీపీ అధికారంలోకి వచ్చిన తర్వాత ఎత్తిపోతల పథకాలను నిర్లక్ష్యం చేశారు. మళ్లీ టీడీపీ అధికారంలోకి రావడంతో ఎత్తిపోతల పథకాలకు పూర్వ వైభవం వచ్చిందని ఇకపై సాగు నీటి కొరత ఉండదని ఆక్వా రైతులు అంటున్నారు. ఎమ్మెల్యే కామినేని శ్రీనివాస్ అధికారులతో కలసి ఎత్తిపోతల పథకాల పునః ప్రారంభానికి సన్నాహాలు చేస్తున్నారు.

ఏం చేద్దాం..



- గ్రామ సభల్లో ఉపాధి అభివృద్ధి పనుల ప్రణాళిక
- 23న పంచాయతీల్లో సభలు.. పనుల గుర్తింపు

ఏలూరు సిటీ, ఆగస్టు 18 : మహాత్మాగాంధీ జాతీయ ఉపాధి హామీ పథకంలో మెటీరియల్ కాంపోనెంట్‌తో అభివృద్ధి పనులకు ప్రణాళిక తయారు చేయడానికి గ్రామ సభలను నిర్వహించాలని, అక్కడే గ్రామ అవసరాలను బట్టి అభివృద్ధి పనులను గుర్తించి ప్రణాళిక సిద్ధం చేయాలని నిర్ణయించారు. జిల్లాలోని 545 గ్రామ పంచాయతీల్లో ఈనెల 23న గ్రామ సభలు నిర్వహించాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఈ ఆర్థిక సంవత్సరంలో రూ. 223.10 కోట్లతో మెటీరియల్ కాంపోనెంట్‌తో సీసీ రహదారులు, సీసీ డ్రెయిన్లతో పాటు ఇతర అభివృద్ధి పనులు చేయాలని నిర్ణయించారు. ఆయా గ్రామ సభలకు సర్పంచ్ అధ్యక్షత వహించగా పంచాయతీ కార్యదర్శి నేతృత్వం వహించాల్సి ఉంది. ఈ సభలకు ఉపాధి హామీ వేతనదారులు, గ్రామ పెద్దలు, యువకులు, మహిళలు, డ్వాక్రా సభ్యులు హాజరై ఆయా గ్రామాల్లో కావాల్సిన అవసరాలను గుర్తించాల్సి ఉంది. అవసరమైతే బీటీ రహదారులు ఈ మెటీరియల్ కాంపోనెంట్ తో చేసే అవకాశాలున్నాయి. రైతులకు అవసరమైన పంత రహదారులు, పాఠశాలలకు ప్రహరీలు, ఉద్యాన రైతులకు సంబంధించి ప్రోత్సాహకాలు, పశువులు, మేకలకు సంబంధించి షెడ్లు ఏర్పాటు, రైతులు తమ పంట చేలల్లో భూగర్భ జలాలు వృద్ధి చెందడానికి వర్షపు నీరును వృథా పోకుండా గట్ల వెంబడి కందకాలు ఏర్పాటు, చెరువుల్లో పూడిక తీత పనులు, గట్ల వెంబడి కొబ్బరి, టేకు వంటి మొక్కలు ఏర్పాటు చేసుకోవడం, పండ్ల తోటల్లో రింగ్ ట్రెంచ్‌లు ఏర్పాటుకు ఈ నిధులు మంజూరు చేస్తారు. గుర్తించిన పనులను ఉపాధి హామీ శాఖ ఏర్పాటు చేసిన బ్లూఫ్రాగ్ యాప్‌లో అప్‌లోడ్ చేయాలి. గ్రామాల అభివృద్ధి కోసం ఉపాధి హామీ పథకంలో మెటీరియల్ కాంపోనెంట్ నిధులను వినియోగించనున్నారు. ఇప్పటికే జిల్లాలో ఈ ఆర్థిక సంవత్సరంలో పశుసంవర్థక శాఖతో కలిపి ఉపాధి పథకంలో 900 యూనిట్లను పశువులు/ గొర్రెలు/ మేకలు / కోళ్ల షెల్టర్ల నిర్మాణం చేపట్టాలని నిర్ణయించారు.

23న గ్రామ సభల నిర్వహణ

జిల్లాలో ఉపాధి హామీ పథకంలో మెటీరియల్ కాంపోనెంట్ ద్వారా చేపట్టే అభివృద్ధి పనులకు సంబంధించి గ్రామాల్లో ప్రణాళికలు రూపొందిస్తాం. దీనికి సంబంధించి ఈనెల 23 వ తేదీన జిల్లాలోని అన్ని గ్రామ పంచాయతీల్లో గ్రామ సభలు నిర్వహిస్తాం. ఆయా గ్రామ సభల్లో గ్రామ అవసరాలకు అనుగుణంగా అభివృద్ధి పనులను గుర్తించి ప్రత్యేక యాప్‌లో అప్‌లోడ్ చేయాల్సి ఉంది. దానిప్రకారమే ఉపాధి నిధులతో అభివృద్ధి పనులను నిర్వహించాల్సి ఉంది. ఆయా గ్రామ సభల నిర్వహణ పారదర్శకంగా నిర్వహిస్తాం.

- ఎ.రాము, డ్వామా పీడీ

కమ్యూనిటీ సోక్ పిట్ నిర్మాణం

గ్రామాల్లో మురుగునీరు నీటి కాల్వ నిర్మాణం చేయడానికి అవకాశం లేని ప్రదేశాల్లో కమ్యూనిటీ సోక్‌పిట్ నిర్మాణం చేయడం వల్ల పారిశుధ్యం మెరుగుపడుతుందని చెబుతున్నారు. పంచాయతీ స్థలాన్ని గుర్తించి ఈ నిర్మాణం చేపట్టడానికి ఉపాధి నిధులను కేటాయిస్తారు. ఈ ఆర్థిక సంవత్సరంలో జిల్లాలో 103 కమ్యూనిటీ సోక్ పిట్ నిర్మాణాలు ప్రారంభమై ప్రగతిలో ఉన్నాయని డ్వామా శాఖాధికారులు చెబుతున్నారు. గ్రామీణ ప్రాంతాల్లో సరైన డ్రెయినేజీ వ్యవస్థ లేని చోట్ల పారిశుధ్యం మెరుగు పరచడానికి రూ.5వేలతో వ్యక్తిగత ఇంకుడు గుంత నిర్మాణాలకు నిధులు కేటాయించారు. ఈ ఆర్థిక సంవత్సరంలో 440 మాజిక్ సోక్‌పిట్‌లకు గాను 61 ప్రగతిలో ఉన్నాయని చెబుతున్నారు.

జిల్లాలో 1.38 లక్షల పనిదినాలు లక్ష్యం

ఈ ఆర్థిక సంవత్సరంలో 1.38 లక్షల పనిదినాల లక్ష్యంగా 2.35 లక్షల కుటుంబాలకు చెందిన 3.79 లక్షలు ఉపాధి హామీ కూలీలకు ఇప్పటివరకు 93 లక్షలు పనిదినాలు కల్పించినట్టు డ్వామా శాఖ నివేదికలు చెబుతున్నాయి. ఇప్పటివరకు రూ. 233.11 కోట్లు వేతనాలుగా చెల్లించి, రూ. 28.81 కోట్లు మెటీరియల్ రూపంలో చెల్లించారు. ఒక్కొక్క కుటుంబానికి సరాసరి 39 పనిదినాలు కల్పించి సరాసరి రూ.250.01 దినసరి వేతనంగా అందించారు. జిల్లాలో 41 వేల పనులకు ఇప్పటిరకు 35 వేలు పనులు పూర్తయ్యాయని నివేదికలు చెబుతున్నాయి. పండ్ల తోటల పెంపకంలో 4,530 ఎకరాలు లక్ష్యంగా నిర్ధేశించుకోగా ఇప్పటి వరకు 3,732 ఎకరాల్లో లబ్ధిదారులను గుర్తించి అంచనాలు వేసి మొక్కలు నాటే కార్యక్రమం జరుగుతోంది.

తాడేపల్లిగూడెంలో ఎయిర్‌పోర్టు!

మళ్లీ తెరపైకి ప్రతిపాదన.. కేంద్రంతో చర్చలు

(భీమవరం-ఆంధ్రజ్యోతి)

ఉమ్మడి పశ్చిమ గోదావరికి నడిబొడ్డున ఉన్న తాడేపల్లిగూడెంలో విమానాశ్రయం నిర్మించాలన్న ప్రతిపాదన మళ్లీ తెరపైకి వచ్చింది. సీఎం చంద్రబాబు నాయుడు ఇటీవల ఢిల్లీ పర్యటనలో భాగంగా రాష్ట్రంలో కొత్తగా ఏర్పాటు చేయబోయే పది విమానాశ్రయాలపై ఆ శాఖ మంత్రి కె.రామ్మోహన్ నాయుడుతో చర్చించారు. ఇందులో తాడేపల్లిగూడెం ఒకటి. జిల్లాలో విమానాశ్రయం అవసరాన్ని దశాబ్దాల క్రితమే గుర్తించారు. కానీ ఆచరణకు నోచుకోలేదు. నాటి కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో తాడేపల్లిగూడెం విమానాశ్రయ భూముల్లో 400 ఎకరాలు కేటాయించారు. నిర్మాణం కోసమని ఓ కంపెనీకి బాధ్యతలు అప్పగించారు. సర్వే చేపట్టారు. తర్వాత ఆ ప్రతిపాదన తెరమరుగైంది. అనంతరం 2014లో తెలుగుదేశం కూటమి అధికారంలోకి వచ్చిన తర్వాత తాడేపల్లిగూడెంలో విమానాశ్రయాన్ని నిర్మిస్తామంటూ ప్రకటించారు. బ్రిటీష్ కాలంలో ఇక్కడ నిర్మించిన ఎయిర్‌స్ట్రిప్ భూములను పరిశీలించారు. పౌర విమానాశాయ శాఖ నుంచి బృందం సర్వే నిర్వహించింది. ఆ తర్వాత అదే భూముల్లో నిట్ ఏర్పాటుకు సన్నాహాలు చేశారు. ఒకవైపు నిట్, మరో వైపు విమానాశ్రయం ఊరిస్తూ వచ్చింది. చివరకు అప్పటి ప్రజా ప్రతినిధులు పైడికొండల మాణిక్యాలరావు, బొలిశెట్టి శ్రీనివాస్ ఏపీ నిట్ వైపే మొగ్గు చూపారు. ఒక దశలో ఏలూరు తరలిన నిట్‌ను తాడేపల్లిగూడెంలో ఉంచేలా కేంద్రస్థాయిలో పావులు కదిపారు. చివరకు ఏపీ నిట్ ఏర్పడింది. తాడేపల్లిగూడెం పరిధిలో తాజాగా అటవీ, రెవెన్యూ భూములు అందుబాటులో ఉన్నాయి. అటవీ భూములు కేటాయించాలంటే అటవీ శాఖకు మూడు రెట్లు రెవెన్యూ భూమి ఇవ్వాలి. టీడీపీ గతంలో అధికారంలో ఉన్నప్పుడు ఆ దిశగా చర్యలు తీసుకున్నారు. తాజాగా విమానాశ్రయం ఏర్పాటు చేయాలంటే వెంకట్రా మన్నగూడెం వద్ద అటవీ, రెవెన్యూ భూములు అక్కరకు రానున్నాయి.

హైవేలకు మహర్దశ

- దిగమర్రు-ఆకివీడు 165 రహదారికి రూ.1,200 కోట్ల కేటాయింపు
- రెండు నెలల్లో 216 రహదారి పెండింగ్ పనులు పూర్తి

నరసాపురం, ఆగస్టు 18: జిల్లాలోని రెండు జాతీయ రహదార్లకు మహర్దశ పట్టనుంది. ఇప్పటికే 90 శాతం పూర్త యి పెండింగ్‌లో వున్న 216 జాతీయ రహదారి పనులను మరో రెండు నెలల్లో పూర్తి చేయాలని ఎన్‌హెచ్ అధికారులు ఆదేశించారు. దిగమర్రు నుంచి ఆకివీడు వరకు ప్రతిపాదిం చిన ఫోర్‌లైన్ 165 కొత్త రహదారికి ఈ బడ్జెట్‌లో రూ.1,200 కోట్లు కేటాయించారు. ఇప్పటికే ఆకివీడు నుంచి పామర్రు వరకు చేపట్టిన పనులు 50 శాతం పనులు పూర్తయ్యాయి. కోర్టు పెండింగ్ కేసుల వల్ల దిగమర్రు నుంచి ఆకివీడు వర కు చేపట్టాల్సిన 40 కిలోమీటర్ల పనులు మూడేళ్లుగా ముం దుకు సాగలేదు. ప్రస్తుతం న్యాయపరమైన చిక్కులు క్లియర్ కావడం, పెద్ద మొత్తంలో నిధులు కేటాయింపు జరగడంతో పనులు జోరందుకోనున్నాయి.

165 జాతీయ రహదారి సాగేదిలా..

పెరుగుతున్న ట్రాఫిక్‌ను నియంత్రించేందుకు కేంద్రం జిల్లాలో కొత్తగా మరో జాతీయ రహదారిని ప్రతిపాదించింది. విజయవాడ కలిసే విధంగా రూపొందిన ఈ రహదారికి 165 జాతీయ రహదారిగా నామకరణం చేశారు. పాలకొల్లు మండలం దిగమర్రు నుంచి కృష్ణా జిల్లా పామర్రు వరకు 114 కిలోమీటర్ల మేర చేపట్టే ఈ రహదారిని రెండు ప్యాకేజీలుగా విభజించారు. ఆకివీడు నుంచి పామర్రు వరకు 70 కిలోమీటర్లు మొదటి ప్యాకేజీగా, దిగమర్రు నుంచి ఆకి వీడు వరకు 40 కిలోమీటర్ల రెండో ప్యాకేజీగా విభజించి టెం డర్లు పిలిచారు. మొదటి ప్యాకేజీ పనులు రెండేళ్ల క్రితమే ప్రారంభమయ్యాయి. దిగమర్రు నుంచి ఆకివీడు వరకు చేపట్టే భూసేకరణ పనులకు న్యాయపరమైన ఇబ్బందులు తలెత్తాయి. కొందరు రైతులు కోర్టుకు వెళ్లడంతో మూడేళ్ళ నుంచి ముందుకు సాగలేదు. ఇటీవల ఇవన్నీ క్లియర్ అయ్యాయి. దీంతో కేంద్రం ఈ పనుల వేగవంతానికి రూ. 1,200 కోట్లు కేటాయించింది. భూసేకరణతోపాటు రోడ్డు నిర్మాణ పనులకు ఈ నిధులు వెచ్చించనున్నారు. ఇప్పటికే మొదటిఫేజ్ పనులు జోరందుకోవడంతో అదే స్పీడ్‌లో రెండో ఫేజ్ పనుల్ని పూర్తి చేయాలన్న లక్ష్యంతో ఎన్‌హెచ్ అధికారులు ఉన్నారు. ఈ రహదారి పాలకొల్లు పట్టణం మీదుగా వెళ్లదు. దిగమర్రు నుంచి బల్లిపాడు, వీరవాసరం, భీమవరం మీదుగా ఆకివీడు వెళుతుంది.

చించినాడ-లోసరి పెండింగ్ పనులు పూర్తి

జిల్లాలో 216 జాతీయ రహదారి పనులు సుమారు 50 కిలోమీటర్ల మేర చేపట్టారు. కత్తిపూడి నుంచి ఒంగోలు వరకు వెళ్లే జాతీయ రహదారి జిల్లాలో చించినాడ వద్ద కలు స్తోంది. 2015లో ప్రారంభించిన ఈ పనులు ఆది నుంచి మందకొడిగానే సాగుతున్నాయి. ప్రస్తుతం ఈ రహదారిపై ట్రాఫిక్‌ను విడిచిపెట్టినా పెండింగ్ పనులు పూర్తికాలేదు. చాలాచోట్ల కల్వర్టు, అప్రోచ్ రహదారులు, లైటింగ్ పనులు పెండింగ్‌లో ఉన్నాయి. వీటన్నింటిని పూర్తి చేయాలని ఇటీ వల ఎన్‌హెచ్ అధికారులు ఆదేశించారు. మచిలీపట్నం ప్రాజెక్టు ఆధికారి పరివేక్షణలో సాగే ఈ పనులను వేగవం తం చేయాలని నిర్ణయించారు. దీంతో రెండు రోజుల నుంచి పెండింగ్ పనులు మొదలుపెట్టారు. అక్టోబర్ నాటికి ఈ పనులను పూర్తి చేయనున్నారు. నరసాపురం పట్టణం పరిధి లోనే చాలా పనులు పెండింగ్‌లో ఉన్నాయి. ఇవి పూర్తయితే 216 జాతీయ రహదారికి కొత్త కళ రానుంది.

సోదర ప్రేమకు ప్రతీక

నేడు రక్షాబంధన్

ద్వారకాతిరుమల/ఏలూరు కార్పొరేషన్/పాలకొల్లు అర్బన్/ ఆగస్టు 18 : శ్రావణ శుద్ధ పౌర్ణమి రోజున రాఖీ పండగతోపాటు జంధ్యాల పౌర్ణమిని కూడా జరుపుకుంటారు. రాఖీ పండుగ నాడు సోదరుడు ఎంత దూరాన ఉన్నా సోదరి వద్దకు వెళ్ళి రాఖీ కట్టించుకుని, పసుపు, కుంకుమలు అందజేస్తారు. తద్వారా సోదరుడికి ఏడాదంతా మంచి జరుగుతుందనే నమ్మకం. రాఖీ కట్టడం వల్ల తమ సోదరుడు తమకు ఎప్పుడూ అండగా ఉంటారని నమ్ముతారు. సోదరులు తమ సోదరీమణులకు అండగా ఉంటామని వాగ్దానం చేస్తారు. ఈ సందర్భంగా మార్కెట్‌లో రాఖీలు పెద్ద ఎత్తున విక్రయాలు జరుగుతున్నాయి. వెండి రాఖీలు ఒక్కొక్కటి రూ. 250, రూ.300 వరకూ ఉండగా వివిధ రకాల రాఖీలు రూ.10 నుంచి రూ.100 వరకూ మార్కెటో అందుబాటులో ఉన్నాయి. రాఖీ పౌర్ణమి సందర్భంగా ఏలూరు, భీమవరం, తణుకు, తాడేపల్లిగూడెం, నరసాపురం, పాలకొల్లు, జంగారెడ్డిగూడెం మార్కెట్‌లలో ప్రత్యేక దుకాణాలు వెలిశాయి. ఏలూరు ఎంపీ పుట్టా మహేష్‌కుమార్ ప్రజలకు రాఖీ పండుగ శుభాకాంక్షలు తెలిపారు.




మార్కెట్‌లో విక్రయిస్తున్న వివిధ రకాల రాఖీలు

రాఖీ ఎప్పుడు కట్టాలి



శాస్త్రాల ప్రకారం భద్రకాలంలో రాఖీ కట్టకూడదని పండితులు చెబుతున్నారు. భద్రకాలం ముగిసిని తర్వాతే రాఖీ కట్టాలి. జ్యోతిష్యం ప్రకారం రాఖీ పౌర్ణమి వేళ మూడు శుభయోగాలు ఏర్పడనున్నాయి. సర్వార్ధ సిద్ధి యోగం, శోభన్‌యోగం, రవియోగం వంటివి ఏర్పడతాయని వారు చెబుతున్నారు. ఈ ఏడాది సోమవారం ఉదయం శ్రావణమాసం శుక్లపక్షంలో పౌర్ణమి తిది తెల్లవారుజామున 3.04 గంటలకు ప్రారంభమవుతుంది. ఆదే రోజు రాత్రి 11-55 కు ముగుస్తుంది. ఈ నేపథ్యంలో పంచాంగం ప్రకారం భద్రకాలం ఉదయం 5.53 గంటలకు ప్రారంభమై మధ్యాహ్నం 1.32 వరకూ ఉంటుంది. భద్రకాలం ముగిసిన తర్వాత సోదరీమణులు రక్షాసూత్రాన్ని తమసోదరుని మణికట్టుపై కట్టోచ్చు. సోమవారం మధ్యాహ్నం ఒంటి గంటా 46 నిమిషాల నుంచి రాత్రి 10 వరకూ శుభసమయం ఉందని పండితులు చెబుతున్నారు.

ఫోటోగ్రఫీలో 50 ఏళ్లుగా సేవలు

అత్తిలి, ఆగస్టు 18 : ఫోటోగ్రఫీ రంగంలో 50 సంవత్సరాలుగా అత్తిలికి చెందిన నందం తాతయ్య విశేష సేవలు అందిస్తున్నారు. పాత కాలపు కెమెరాలతో పాటు అత్యాధునిక కెమెరాలను కూడా విని యోగించిన ఘనత తాతయ్యకు దక్కుతుంది. ఒకప్పుడు ఫోటో కావాలంటే తప్పనిసరిగా స్టూడియోకు వెళ్ళి ఫోటో తీయించుకునేవారు. సుదీర్ఘ కాలం ప్రాసెసింగ్ ఐన తర్వాత ఫోటో ఇచ్చేవారు. ఇప్పుడైతే క్షణాలలో ఫోటో చేతిలో పెడుతున్నారు. ఫోటోగ్రఫీలో సాం కేతికత పెరిగిన తర్వాత ఫోటో గ్రాఫర్ల జీవితాల్లో మార్పు వచ్చిం దని తాతయ్య వాపోయారు. అత్యాధునిక కెమెరాలతో పాటు సెల్‌ఫోన్లు వచ్చాక ఫోటోగ్రఫర్లకు ఉపాధి తగ్గిపోయిందన్నారు. తన నైపుణ్యంతో ఎంతో క్లిష్టమైన ఫోటోలు తీసే తాతయ్య ఫోటోగ్రఫీ వృత్తితో తృప్తి పడక సమాజ సేవలో కూడా పాలుపంచుకుంటున్నారు. పిఠాపురంలో గల విశ్వవిజ్ఞాన విద్యా ఆధ్యాత్మిక పీఠం జిల్లా కన్వీనర్‌గా సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. రెండేళ్లుగా కరోనా మహమ్మారి ప్రజలను ఇబ్బందులు పెట్టగా పీఠం తరఫున నిరంతరాయంగా భోజన ప్లేట్లు, కరోనా నివారణ మందులు అందజేశారు. పలువురికి నిత్యావసర సరుకులు తాతయ్య అందించారు.



తాతయ్య తీసిన ఫోటో...





నాటి నుంచి నేటి వరకు తాతయ్య వినియోగించిన కెమెరాలు

హైదరాబాద్ బస్సులు కిటకిట

- ఆరు స్పెషల్ సర్వీసులు ఏర్పాటు
- నేడు కూడా కొనసాగనున్న రద్దీ



భీమవరం టౌన్, ఆగస్టు 18 : వరుసగా నాలుగు రోజులు సెలవులు రావడంతో హైదారాబాద్ నుంచి స్వస్థలాలకు వచ్చిన వారు తిరిగి హైదరాబాద్‌కు బయలుదేరడంతో జిల్లాలోని ఆర్టీసీ బస్సులు కిటకిటలాడుతున్నాయి. స్వాతంత్ర్య దినోత్సవం, వరలక్ష్మి వ్రతం, శనివారం, ఆదివారం వరసగా సెలవులు రావడంతో అనేకమంది హైదరాబాద్ నుంచి సొంత గ్రామాలకు వచ్చారు. దీనికి తోడు శుభకార్యాలు ఈ సెలవులోనే రావడంతో రద్దీ మరింత పెరిగింది. ఆదివారంతో సెలవులు ముగియడంతో తిరిగి హైదరాబాద్‌కు పయనమయ్యారు. దీంతో ఆర్టీసీ హైదరాబాద్‌కు నడిపే 15 సర్వీసులకు రిజర్వేషన్ పూర్తి కావడంతో ప్రత్యేక సర్వీసులను నడుపుతోంది. భీమవరం డిపో నుంచి ఒకటి, నరసాపురం డిపో నుంచి నాలుగు, తాడేపల్లిగూడెం డిపో నుంచి ఒక సర్వీసు నడుపుతున్నట్లు అధికారులు తెలిపారు. సోమవారం రద్దీ కొనఉందని రెగ్యూలర్ సర్వీసులకు రిజర్వేషన్లు పూర్తి అయ్యాయని, రద్దీ ఉంటే డిపో నుంచి ప్రత్యేక సర్వీసులు ఏర్పాటు చేస్తారని చెబుతున్నారు.

ప్రైవేట్ బస్సుల దోపిడీ

రద్దీ దృష్ట్యా ప్రైవేట్ యాజమాన్యాలు దోపిడీకి తెరలేపారు. టికెట్టు ధర రూ.రెండు వేలకు పెంచేయడంతో ప్రయాణికులు కంగుతింటున్నారు. సంకాంత్రి సీజన్‌లోనే లేని ధర ఇప్పుడు ఉండడంతో ఆశ్చర్యపోతున్నారు. తప్పనిసరి పరిస్థితిలో టికెట్టు బుక్ చేసుకుంటున్నారు. కొంత మంది ప్రయాణాన్ని వాయిదా వేసుకుంటున్నారు. వాహనాలపై వచ్చిన వారు కుటుంబ సభ్యులతో కలసి బయలుదేరి వెళ్ళారు.

రైలింగ్ ఊడి.. బీటలు వారి..



ఆలపాడు జువ్వకనుమల డ్రెయిన్‌పై వంతెన ప్రమాదకరం



జువ్వకనుమల డ్రెయిన్‌పై శిథిల వంతెన (ఇన్‌సెట్) వంతెనపై బీటలు

నిత్యం వేలాది మంది ప్రయాణించే మార్గంలో ఉన్న వంతెన శిథిలావస్థకు చేరడంతో ఆ వంతెనపై ప్రజలు బిక్కుబిక్కుమంటూ రాకపోకలు సాగిస్తున్నా రు. ఈ మార్గం గుండా కొల్లేరు ప్రజలే కాక పెద్దింటి అమ్మవారిని దర్శించుకునేందుకు భక్తులు నిత్యం వస్తూనే ఉంటారు. కైకలూరు మండలం ఆలపాడులో జువ్వకనుమల డ్రెయిన్‌పై వంతెన అధ్వానంగా ఉంది. వంతెనకు ఇరువైపులా రైలింగ్ దెబ్బతినడమే కాక, గోడలు బీటలు వారి ప్రమాదస్థితికి చేరారు. దశాబ్దాల కాలం నాడు నిర్మించిన వంతెన కావ డం, కనీస మరమ్మతులు కూడా నిర్వహించకపోవడంతో ఈ దుస్థితి నెలకొంది. వంతెన వద్ద దట్ట మైన చెట్లు ఏర్పడడం, బీటలు వారడంతో ప్రమాదం పొంచి ఉందని భక్తులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. అధికారులు ఇప్పటికైనా స్పందించి వంతెనకు కనీస మరమ్మతులు నిర్వహించాలని కోరుతున్నారు. -కైకలూరు

తగ్గిన చికెన్ ధరలు



తణుకు, ఆగస్టు 18 : మార్కెట్లో చికెన్ ధరలు తగ్గుముఖం పట్టాయి. శ్రావణ మాసం ఆరంభం కావడం, వరలక్ష్మి వ్రతం మొదలుకొని మాంసం తినే వారి సంఖ్య తగ్గిపోయింది. దీంతో ఒక్కసారిగా చికెన్ ధరలు తగ్గిపోయాయి. వర్షాకాలం అయినప్పటికి ఎండలు బాగా మండిపోతున్నాయి. ఇది కూడా అమ్మకాలు తగ్గడానికి కారణంగా వ్యాపారులు చెబుతున్నారు. గత పదిహేను రోజులు నుంచి చికెన్ ధరలు తగ్గాయంటున్నారు. ప్రస్తుతం మార్కెట్లో స్కిన్ లెస్ రూ.200, స్కిన్ రూ.180 వరకు విక్రయిస్తున్నారు. బ్రాయిలర్ పెంపకందార్లు తక్కువగానే ఉంటున్నారు. సరైన ధరలు లేకపోవడం వల్ల చిన్న వ్యాపారులు వద్ద బ్రాయిలర్ కోళ్ళు లేకుండా పోయాయి. ప్రస్తుతం కార్పొరేట్ కంపెనీలు వద్ద మాత్రమే ఉన్నాయి. అయినప్పటికీ వారు కూడా లాభాలు ఆశించకుండానే వ్యాపారాలు చేస్తున్నారని చెబుతున్నారు. రానున్నవి అన్నీ పండగ రోజులు కావడం వల్ల ధరలు మరింత తగ్గుముఖం పట్టే అవకాశాలు లేకపోలేదు. గత నాలుగు రోజులుగా చికెన్ ధరను స్వల్పంగా పెంచుతున్నారు. కేజీకి రూ.20 వరకు పెరిగినట్లు చెబుతున్నారు. అయినప్పటికి రైతులు వద్ద కోళ్ళు లేకపోవడం, కంపెనీలు కూడా లైవ్ కేజీ రూ.100 నుంచి రూ.105 వరకు అమ్ముతున్నారు. దీంతో కేజీకి రూ.పది పెరిగితే తప్ప గిట్టుబాటు అయ్యే పరిస్థితి లేదని వ్యాపారులు చెబుతున్నారు.

కిటకిటలాడిన వెంకన్న క్షేత్రం

ద్వారకాతిరుమల, ఆగస్టు 18: ద్వారకా తిరుమలేశుని దివ్యక్షేత్రం ఆదివారం భక్తజనులతో కిటకిటలాడింది. సాధారణ సెలవు రోజు కావడంతోపాటు ఈ శ్రావణ మాసంలో ఎక్కువగా వివాహాలు జరిగాయి. దీంతో ఆదివారం ఉదయం నూతన దంపతులు, వారి బంధువులు శ్రీవారిని దర్శించుకునేందుకు వచ్చారు. దీంతో ఆలయంలోని అన్ని విభాగాలు యాత్రికులతో నిండిపోయాయి. దాదాపు 15 వేల మంది వరకూ యాత్రికులు వచ్చి స్వామి, అమ్మవార్లను దర్శించినట్లు ఆలయవర్గాలు భావిస్తున్నాయి.



మెట్ల మార్గంలో భక్తుల రద్దీ

గల్ఫ్‌లో కష్టాలకు విముక్తి.. స్వగ్రామానికి సంకురమ్మ



బుట్టాయగూడెం, ఆగస్టు 18 : ఉపాధి కోసం ఇతర దేశాలకు వెళ్ళి అష్టకష్టాలు పడిన తాతి సంకురమ్మ ఎట్టకేలకు కువైట్ నుంచి స్వగ్రామానికి వస్తుంది. బుట్టాయగూడెం మండలం మర్లగూడెంకు చెందిన గిరిజన మహిళ తాతి సంకురమ్మ ఉపాధి కోసం ఏడాది క్రితం కువైట్ వెళ్ళింది. అక్కడున్న వారు తనను అనేక ఇబ్బందులు పెడుతున్నారని, భోజనం కూడా పెట్టడం లేదని, అనారోగ్యంగా ఉన్నా పట్టించుకోవడంలేదని ఇక్కడే ఉంటే చనిపోతానని సెల్ఫీ వీడియో కాల్ ద్వారా సమాచారాన్ని కుటుంబ సభ్యులకు తెలపడంతో వారు స్థానిక ఎమ్మెల్యే చిర్రి బాలరాజు దృష్టికి తీసుకువెళ్ళి సహాయం చేయాలని, సంకురమ్మను ఇండియాకు రప్పించాలని కోరడంతో ప్రభుత్వ సాయంతో ఇండియాకు రప్పించే ప్రయత్నాలు చేశారు. దీంతో సంకురమ్మ ఈ నెల 20న కువైట్ నుంచి మర్లగూడెం వస్తున్నట్లు కుటుంబ సభ్యులకు సమాచారం ఇచ్చింది. తన కోసం అధికారులు, ఏజెంట్లతో మాట్లాడి సురక్షితంగా స్వగ్రామానికి తీసుకురావడానికి కృషి చేసిన ఎమ్మెల్యే బాలరాజుకు ప్రత్యేకంగా కృతజ్ఞతలు తెలియజేసింది..

ఒడిశా సీఎంను కలిసిన ఎమ్మెల్యే బొలిశెట్టి



తాడేపల్లిగూడెం అర్బన్, ఆగస్టు 18: ఒడిశా ముఖ్యమంత్రి మోహన్ చరణ్ మజ్జీని తాడేపల్లిగూడెం ఎమ్మెల్యే బొలిశెట్టి శ్రీనివాస్ ఆదివారం మర్యాద పూర్వకంగా కలిశారు. భువనేశ్వర్‌లో సీఎం క్యాంప్ కార్యాలయానికి వెళ్లి సీఎంతో భేటీ అయ్యారు. ఆ రాష్ట్రంలో ఆరోగ్యశ్రీ విజయవంతంగా నిర్వహిస్తున్న విషయాన్ని అడిగి తెలుసుకున్నారు. ప్రతి వ్యక్తికి రూ.10 లక్షల వంతున ఒడిశాలో వైద్య సేవలకు అందిస్తున్నామని, ఇందుకు నిధులు ముందుగానే సమకూరుస్తున్నామని సీఎం వివరించారు.

కోళ్ల వ్యర్థాల వాహనం పట్టివేత

పెదపాడు, ఆగస్టు 18 : చేపల చెరువుల్లో మేతగా వేసేందుకు కోళ్లవ్యర్థాలను తరలిస్తుండగా తనిఖీలు నిర్వహించి పెదపాడు వద్ద బోలెరో వాహనాన్ని స్వాధీనం చేసుకున్నట్లుగా ఎస్సై కె.శుభశేఖర్ తెలిపారు. వాహన, చెరువు యజమానులు, వాహన డ్రైవర్‌పై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని తెలిపారు.

రోడ్ల నిర్మాణం చేపట్టాలని నిరసన

ఇరగవరం, ఆగస్టు 18 : వైసీపీ పాలనలో గ్రామాల్లోన్ని రోడ్లన్నీ అధ్వానంగా తయారయ్యాయని ప్రజా సంఘాల నాయకులు విమర్శించారు. మండలంలో అధ్వానంగా ఉన్న రోడ్ల నిర్మాణాన్ని చేపట్టాలని కోరుతూ కత్తవపాడు-జుత్తిగ రహదారిలో ఆదివారం ప్రజలు రోడ్డుపై నిరసన తెలిపారు. కత్తవపాడు, పొదలాడ, జుత్తిగ, పెనుమంత్ర అనేక గ్రామాలు ప్రజలు ఈ రోడ్డు గుండా రాకపోకలు సాగిస్తారని రైతులు, విద్యార్థులు ప్రతి రోజు ఈ రోడ్డు నుంచి ప్రయాణం సాగిస్తారన్నారు. ఐదేళ్లుగా ఈ రోడ్డు పూర్తిగా పాడైపోయి గుంతలు పడి ప్రమాదాలు జరుగుతున్నా తాత్కాలికంగా గుంటలు పూడ్చడమే తప్ప నిర్మాణం చేపట్టలేదని ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రజా సంఘాల నాయకులు కామన మునిస్వామి, దంపనబోయిన విజయలక్ష్మి, కొప్పిశెట్టి అరుణ కుమారి తదితరులు పాల్గొన్నారు.

క్రైం కార్నర్

విద్యుదాఘాతానికి వ్యక్తి మృతి



వెంకటరమణ మృతదేహం

భీమడోలు, ఆగస్టు 18 : విద్యుత్ షాక్‌తో వ్యక్తి మృతి చెందిన సంఘటన భీమడోలు మండలం సూరప్ప గూడెంలో జరిగింది. ఎస్‌ఐ సుధాకర్ తెలిపిన వివరాలివి.. గ్రామానికి చెందిన బోను వెంకట రమణ (52) ఆదివారం ఉదయం డ్రైనేజీ శుభ్రం చేసేందుకు పక్కనే ఉన్న తన తోడల్లుడు డాబాపైకి ఎక్కి ఇనుప ఊచ తీస్తుండగా డాబాపైనే విద్యుత్ తీగలకు ఇనుప ఊచ తగిలి షాక్‌నకు గురయ్యాడు. ఈ ప్రమాదంలో వెంకట రమణ అక్కడికక్కడే మృతి చెందాడు. అతని కుమారుడు అరవింద్ కుమార్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. వెంకట రమణ భీమడోలులో ఆటో నడుపుతూ జీవనం సాగిస్తున్నారు. ఆయనకి భార్యా, పిల్లలు ఉన్నారు.

అపార్ట్‌మెంట్‌లో విద్యుత్‌షాక్.. ఒకరి మృతి

భీమవరం క్రైం, ఆగస్టు 18 : ఒక అపార్ట్‌మెంట్‌లో పని చేస్తుండగా ప్రమాదవశాత్తూ కరెంటు షాక్ తగిలి చికిత్స కోసం ఆసుపత్రికి తీసుకువెళ్తుండగా ఓ వ్యక్తి మృతి చెందాడు. టూ టౌన్ ఎస్‌ఐ వీర్రాజు తెలిపిన వివరాలు ప్రకారం భీమవరం మండలం ఎల్‌వీఎన్‌పురం గ్రామానికి చెందిన ఉప్పులపాటి సుబ్బారావు (67) ఈ నెల 17న ఏఎస్‌ఆర్ నగర్‌లోని లోటస్ అపార్ట్‌మెంట్‌లో పని నిమిత్తం వచ్చాడు. అయితే అక్కడ ఉన్న బల్బుకు ఉన్న వైరు తగిలి కరెంటు షాక్ తగిలింది. దీంతో అతన్ని ఆసుపత్రికి తరలించారు. అయితే అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు. మృతుని భార్య ఉప్పులపాటి లక్ష్మీ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

మొగల్తూరులో పేకాట స్థావరంపై దాడి

మొగల్తూరు, ఆగస్టు 18: మొగల్తూరు పంచాయతీ వడయార్‌పేట సమీపంలో ఆదివారం ఒక గృహంలో నిర్వహిస్తున్న స్థావరంపై ఆదివారం పోలీసులు దాడి చేశారు. ఈ దాడిలో ముగ్గురు వ్యక్తులను అదుపులోకి తీసుకుని రూ.5,200లు నగదు స్వాధీనం చేసుకున్నట్టు మొగల్తూరు ఎస్‌ఐ జి.వాసు తెలిపారు.

కోడిపందేలు ఆడుతున్న ఏడుగురి అరెస్టు

కాళ్ళ, ఆగస్టు 18 : కోడిపందేలు నిర్వహిస్తున్న స్థావరంపై దాడి చేసి ఏడుగురు వ్యక్తులను అదుపులోకి తీసుకున్నట్లు కాళ్ళ ఎస్‌ఐ ఎస్.శ్రీనివాసరావు ఆదివారం తెలిపారు. బొండాడ గ్రామ శివారులో కోడిపందేలు నిర్వహిస్తున్నారనే సమాచారం మేరకు సిబ్బందితో కలిసి దాడి చేసి ఏడుగురు వ్యక్తులను అరెస్టు చేసి వారి వద్ద రూ.2,250 నగదు, కోడిపుంజు, కోడికత్తి స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేశామని తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో వృద్ధురాలి మృతి



పంటబోదెలోకి దూసుకెళ్ళిన కారు

పెంటపాడు, ఆగస్టు 18 : రోడ్డు ప్రమాదంలో వృద్ధురాలు మృతి చెందింది. పోలీసులు తెలిపిన వివరాలివి. నిడదవోలుకు చెందిన తల్లి వీర రాఘవతి (77), ఈమె కుమారుడు కోటేశ్వరరావు శనివారం సాయంత్రం హైదరాబాద్ నుంచి తమ స్వగ్రామం నిడదవోలు కారులో వస్తున్నారు. ప్రత్తిపాడు జాతీయ రహదారిపై వీరు ప్రయాణం చేస్తున్న కారును వెనుక నుంచి మరో కారు ఢీకొట్టింది. దీంతో అదుపు తప్పి కారు పక్కనే ఉన్న పంట బోదెలోకి దూసుకు వెళ్ళింది. ప్రమాదంలో తీవ్ర గాయాలైన వీరరాఘవతిని 108లో తాడేపల్లిగూడెంలోని ఒక ప్రైవేటు ఆసుపత్రికి తరలిస్తుండంగా మార్గ మధ్యలో మృతి చెందినట్లు ఎస్‌ఐ శంకర్ తెలిపారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం గూడెం ఏరియా ఆస్పత్రికి తరలించామని, కుమారుడు కోటేశ్వరరావు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశారు.

ప్రేమించకపోతే చంపేస్తానని బెదిరింపు

ఏలూరు క్రైం, ఆగస్టు 18 : తనను ప్రేమించకపోతే చంపేస్తానని ఓ విద్యార్థినిని ఓ యువకుడు బెదిరించాడు. వివరాలివి.. ఏలూరు నగరంలోని ఒక ప్రాంతానికి చెందిన విద్యార్థిని(14) పదో తరగతి చదువుతుంది. ఏలూరు శనివా రపుపేటనకు చెందిన లంకపల్లి విష్ణు (20) అనే యువకుడు రోజూ వెంటపడి తనను ప్రేమించాలని వేధిస్తున్నాడు. ఈ నెల 17వ తేదీ మధ్యాహ్నం ఆ విద్యార్థిని ఇంట్లో ఉండగా తనను ప్రేమించాలని లేదం టే చంపివేస్తానని విష్ణు బెదిరించాడు. అదే సమయంలో ఆ విద్యార్థిని అమ్మమ్మ రావడంతో పారిపోయాడు. ఈ విషయం పెద్దలతో చెప్పి మందలించడంతో విష్ణు, అతని స్నేహితులు మరో ఇద్దరు వచ్చి ఆ బాలికను చెంపలపై కొట్టారు. ఈ సంఘటనపై ఏలూరు త్రి టౌన్ పోలీస్ స్టేషన్‌లో ఆదివారం ఉదయం బాధితురాలి తల్లి ఫిర్యాదు చేయడంతో సీఐ కె.శ్రీనివాసరావు ఆధ్వర్యంలో ఆ ముగ్గురు యువకుల పై ఈవ్ టీజింగ్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

మహిళపై అత్యాచారయత్నం కేసులో

ముగ్గురు యువకుల అరెస్టు



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న ఏలూరు డీఎస్పీ శ్రావణ్‌కుమార్

ఏలూరు క్రైం, ఆగస్టు 18 : ఏలూరు వన్ టౌన్ ప్రాంతంలో అర్ధరాత్రివేళ ఒక మహిళపై అత్యా చారయత్నానికి పాల్పడిన కేసులో ముగ్గురు యువకులను అరెస్టు చేశా మని ఏలూరు డీఎస్పీ శ్రావణ్ కుమార్ చెప్పారు. ఏలూరు వన్ టౌన్ పోలీస్ స్టేషన్‌లో ఆదివారం మధ్యాహ్నం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ లింగపాలెం మండలానికి చెందిన 35 ఏళ్ళ వివాహిత భర్త మరణించడంతో ఆమె పెదవేగి మండలంలోని ఒక గ్రామంలో ఉన్న కోళ్ళ ఫారంలో పనికి వెళ్ళి అక్కడ పరిచయం అయిన వ్యక్తితో సహజీ వనం చేస్తుంది. పది రోజుల క్రితం వారిద్దరూ కలిసి ఏలూరులోని ఒక హోటల్‌లో పని చేయడానికి వచ్చి వన్ టౌన్‌లోని ఒక గుడి ఆవరణలో తల దాచుకున్నారు. ఈ నెల 16వ తేదీ అర్ధరాత్రి సమయంలో ముగ్గురు యువకులు వచ్చి వారు భోజనం చేస్తున్న సమయంలో వారితో మాటలు కలిపి మద్యాన్ని ఆ ముగ్గురు యువకులతోపాటు వీరిద్దరు కూడా తాగారు. అద్దెకు ఇల్లు చూపిస్తామని తమ ప్రాంతాల్లో ఉన్నాయని పేర్లు చెప్పుకుని ఆ తరువాత ఆ మహిళపై అత్యాచారయత్నానికి పాల్పడ్డారు. ఈ నేపథ్యంలో ఆ మహిళను, యువకుడుని కొట్టడంతో వారు కేకలు వేశారు. అటుగా ఒక యువకుడు రావడంతో ఆ ముగ్గురు యువకులు పారిపోయారు. ఈ సమాచారం అందుకున్న 15 నిముషాల్లోనే బీట్ పోలీసులు, నైట్ గస్తీలో ఉన్న ఎస్‌ఐ సాధిక్ వెంటనే బాధితురాలితో మాట్లాడి వివరాలు తెలుసుకుని వారి ఆసుపత్రికి తరలించా మన్నారు. జిల్లా ఎస్పీ కేపీఎస్ కిశోర్ ఆదేశాలతో వన్ టౌన్ సీఐ రాజశేఖర్ ఆధ్వర్యంలో ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసి వారి జాడ తెలుసుకున్నామన్నారు. వారిని గుర్తించి అరెస్టు చేశామన్నారు. కోర్టులో హాజరుపర్చగా రిమాండ్ విధించామన్నారు. కొన్ని మీడియాల్లో (ఆంధ్రజ్యోతి కాదు) మూకుమ్మడి అత్యాచారమని ప్రచారం చేశారని ఇది వాస్తవం కాదని అత్యాచారయత్నం మాత్రమే జరిగిందని ఏదైనా సమాచారాన్ని పోలీసు అధికారుల నుంచి నిర్ధారణ చేసుకున్న తరువాతే మీడియాలో ప్రచారం చేయాలే తప్ప అనవసరంగా ప్రజలను భయభ్రాంతులకు గురి చేయవద్దని ఆయన సూచించారు. ఈ సమావేశంలో వన్‌టౌన్ సీఐ ఎస్.రాజశేఖర్, ఎస్‌ఐలు లక్ష్మణబాబు, నవీన్‌కుమార్ పాల్గొన్నారు.

బంగారు ఆభరణాల బ్యాగ్‌ను

ఆటోలో మర్చిపోయిన మహిళ

గంటల వ్యవధిలోనే బ్యాగ్‌ను అప్పగించిన పోలీసులు

ఏలూరు క్రైం, ఆగస్టు 18 : బంధువుల ఇంట్లో జరిగే శారీ ఫంక్షన్ కోసం వచ్చి ఇంటి నుంచి ఫంక్షన్ హాలుకు ఆటోలో నగలు బ్యాగ్‌తో వెళ్ళిన ఆ మహిళ ఫంక్షన్ హాలు వద్ద ఆటోలో బ్యాగ్ మర్చిపోయారు. ఈ ఘటనపై త్రీ టౌన్ పోలీసులకు ఫిర్యాదు చేయడంతో వారు ఆటో యూనియన్ నాయకుడి సహకారంతోపాటు సాంకేతిక పరిజ్ఞానం ఉపయోగించి ఆటోను గుర్తించి వస్తువులను బాధితురాలికి అప్పగించారు. తెలంగాణ రాష్ట్రం రాజాన్న సిరిసిల్ల జిల్లా వేములవాడ మండలం వేములవాడ గ్రామానికి చెందిన చిట్టి శివకుమారి ఏలూరులో ఆదివారం ఉదయం శారీ ఫంక్షన్‌కు హాజరయ్యే నిమిత్తం కొత్తపేటలో ఉన్న బంధువుల ఇంటికి వచ్చారు. అక్కడ నుంచి ఏలూరు మినీ బైపాస్ రోడ్డులో చలసాని గార్డెన్స్ కల్యాణ మండపానికి వెళ్ళే నిమిత్తం ఉదయం 10 గంటలకు ఒక ఆటో ఎక్కారు. ఆమెతో పాటు 80 గ్రాముల బంగారు ఆభరణాలు, వస్త్రాలు ఉన్న బ్యాగ్‌ను తీసుకుని బయలుదేరారు. కల్యాణ మండపం వద్ద బ్యాగ్‌ను ఆటోలో మర్చిపోయారు. ఈ సంఘటనపై ఏలూరు త్రీ టౌన్ పోలీసులకు బాధితురాలు ఫిర్యాదు చేయగా సీఐ కె.శ్రీనివాసరావు ఆదేశాలతో ఎస్‌ఐ ప్రసాద్ వెంటనే ఏలూరు ఆటో యూనియన్ అధ్యక్షుడు లీలా కృష్ణను సంప్రదించారు. మరోవైపు సాంకేతిక పరిజ్ఞానం కూడా వినియోగించి ఆటో డ్రైవర్‌ను గుర్తించారు. ఆటో డ్రైవర్ తన ఆటోలో బాధితురాలి బ్యాగ్ ఉన్న విషయం కూడా గమనించలేదు. దీంతో పోలీసులు ఆ బ్యాగ్‌ను స్వాధీనం చేసుకున్నారు. బాధితురాలికి ఆదివారం రాత్రి ఏలూరు డీఎస్పీ శ్రావణ్‌కుమార్ సమక్షంలో సీఐ కె.శ్రీనివాసరావు, ఎస్‌ఐ గారపాటి అజయ్‌కుమార్, పోలీసు సిబ్బంది బ్యాగ్ అందజేశారు. ఆటోను త్వరితగతిన గుర్తించడంలో ఎస్‌ఐ అజయ్‌కుమార్, హెడ్ కానిస్టేబుల్ విజయ్‌రాజ్, రఘులకు రివార్డులు ఇస్తామని డీఎస్పీ అన్నారు.



వస్తువులున్న బ్యాగ్‌ను అప్పగిస్తున్న పోలీసు అధికారులు

మామ మందలించాడని కోడలు ఆత్మహత్య

యాదాద్రి భువనగిరి జిల్లా సురేంద్రపురంలో ఘటన

భువనగిరి రూరల్, ఆగస్టు 18: మనవడిని కొట్టొద్దని మామ మందలించడంతో మనస్తాపానికి గురైన కోడలు ఆత్మహత్య చేసుకుంది. యాదాద్రి భువనగిరి జిల్లా భువనగిరి మండలంలో ఈ సంఘటన జరిగింది. భువనగిరి రూరల్ ఎస్‌ఐ సంతోష్‌కుమార్ తెలిపిన వివరాలిలా ఉన్నాయి... ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం ఏలూరు జిల్లా చింతలపూడి గ్రామానికి చెందిన కె.శ్రీనివాస్‌రాజు కుమార్తె భార్గవి(28)కి ఖమ్మం జిల్లా వేంసూరు మండలం శంభునిగూడేనికి చెందిన సతీష్‌రాజుతో 2020, ఆగస్టు 26న వివాహమైంది. భర్త సతీష్‌రాజు, మామ సత్యనారాయణతో భువనగిరి మండలంలోని సురేంద్రపురిలో నివాసం ఉంటున్నారు. శనివారం సాయంత్రం భార్గవి తన రెండున్నరేళ్ల కుమారుడు శివరామరాజుకు అన్నం తినిపిస్తూ కొట్టింది. అదే సమయంలో మామ సత్యనారాయణ కోడలిని మందలించడంతో మనస్తాపానికి గురైన ఇంట్లోకి వెళ్లి ఫ్యాన్‌కు ఉరి వేసుకుంది. విషయం తెలుసుకున్న భర్త సతీష్‌రాజు కుటుంబ సభ్యులు తలుపులు పగులగొట్టి ఆమెను చికిత్స నిమిత్తం జిల్లా కేంద్ర ఆస్పత్రికి తరలించగా అప్పటికే మృతి చెందిందని డాక్టర్ తెలిపారు. భార్గవి తండ్రి శ్రీనివాస్‌రాజు ఆదివారం ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్లు రూరల్ ఎస్‌ఐ సంతోష్‌కుమార్ తెలిపారు.

అందని సాగునీరు

తూడుతో అన్నవరం బ్రాంచ్ పంటకాల్వ



ముదినేపల్లి, ఆగస్టు 18: మండలంలోని పలు గ్రామాల ఆయకట్టుకు సాగునీరందించే అన్నవరం బ్రాంచ్ పంటకాలువ పూర్తిగా తూడుతో నిండిపోయింది. దీంతో పీఎస్ఎస్ ఛానల్ నుంచి నీరు విడుదల చేసినప్పటికీ ఈ పంట కాలువలో నీటి ప్రవాహానికి తూటు కాడ ఆటంకంగా మారింది. దీంతో ఈ కాలువ కింద సాగులో ఉన్న వడాలి, అప్పారావుపేట, ముదినేపల్లి, అన్నవరం గ్రామాల పరిధిలోని వందలాది ఎకరాల్లో సార్వా వరి పైరుకు సకాలంలో నీరందటం లేదు. దీంతో వరి నాట్లు వేసేందుకు కూడా అవకాశం లేకుండాపోయింది. ఈ పంట కాలువను ఉపాధి పథకం కింద నామమాత్రంగా మరమ్మతులు చేయటం తప్ప ఇరిగేషన్ శాఖ ఆధ్వర్యంలో పూర్తిస్థాయిలో పూడిక, తూటుకాడ తొలగింపు కానీ సార్వా సీజన్‌కు ముందు జరగటం లేదు. దీంతో ఇరిగేషన్ అధికారులు అన్నవరం పంట కాలువలో పేరుకుపోయిన తూటుకాడను తొలగింపునకు వెంటనే చర్యలు తీసుకోవాలని రైతులు కోరుతున్నారు.



గుబ్బల మంగమ్మను దర్శించుకుంటున్న భక్తులు

గుబ్బల మంగమ్మ ఆలయం వద్ద భక్తుల రద్దీ

బుట్టాయగూడెం, ఆగస్టు 18: అడవి బిడ్డల ఆరాధ్య దైవం గుబ్బల మంగమ్మ దర్శనానికి ఆదివారం భక్తుల రద్దీ నెలకొంది. ఇటీవల ఏజెన్సీలో భారీ వర్షాలతో వాగులు పొంగడంతో అమ్మవారి దర్శనానికి అవకాశం లేకుండా పోయింది. వారం రోజులుగా వాతావరణం పొడిగా ఉండడంతో ఆలయ కమిటీ అమ్మవారి దర్శనానికి ఏర్పాట్లు చేయడంతో అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చారు. అమ్మవారిని దర్శించుకుని మొక్కుబడులు తీర్చుకున్నారు. వర్షాకాలం కావడంతో మధ్యాహ్నం 3 గంటలకు పూజాది కార్యక్రమాలు, భోజనాలు ముగించి బయటకు పంపించారు. చాలా కాలం తర్వాత అమ్మవారి ఆలయం ప్రాంగణం భక్తులతో కిటకిటలాడింది.



కనకదుర్గకు సారె సమర్పణ

చింతలపూడి, ఆగస్టు 18: సీతానగరం గ్రామంలోని కనకదుర్గమ్మకు శ్రావణ మాసం సందర్భంగా మహిళలు ఆదివారం సారె సమర్పించారు. పసుపు, కుంకుమ, స్వీట్లు, పండ్లు, చీర, రకరకాల స్వీట్లు అమ్మవారికి సమర్పించారు. ముందుగా గ్రామంలో ఊరేగింపు నిర్వహించి అమ్మవారికి ఆలయానికి చేరుకున్నారు. సామూహిక పారాయణ కార్యక్రమం నిర్వహించారు.

సూర్యనారాయణస్వామికి ప్రత్యేక పూజలు

ఏలూరు కార్పొరేషన్, ఆగస్టు 18: పవరుపేట స్టేషన్ రోడ్డులోని ధన్వంతరి వైద్య భగవానుని ఆలయంలో భక్తులు ఆదివారం విశేష పూజలు నిర్వహించారు. అభిషేకాలు, అర్చనలు నిర్వహించారు. ఆలయ ప్రదక్షిణలు నిర్వహించి సూర్య నమస్కార పూజలు జరిపారు. అర్చకుల నుంచి రక్షాబంధనాలను కట్టించుకున్నారు. సూర్యదేవుని స్తోత్రాలను ఆలపించారు. ఆలయ అర్చకులు ఆది భక్తులతో పూజలు చేయించారు. ఆలయ కమిటీ సభ్యులు భక్తులకు తగు ఏర్పాట్లు చేశారు.

అమ్మవారి ఆలయాల్లో ప్రత్యేక పూజలు

ఏలూరు కార్పొరేషన్, ఆగస్టు 18: నగరంలో అమ్మవారి ఆలయాల వద్ద భక్తులు ఆదివారం ప్రత్యేక పూజలు చేశారు. కుటుంబ సమేతంగా అమ్మవారిని దర్శించుకుని కుంకుమార్చనలు నిర్వహించారు. అమ్మవారికి కుటుంబ సభ్యులతో ప్రత్యేక పూజలు నిర్వహించారు. కొత్తపేట నూకాలమ్మ, పడమరవీధి, గానుగులపేట, దక్షిణపువీధి, పత్తేబాద గంగానమ్మ ఆలయాల వద్ద భక్తుల రద్దీ నెలకొంది.



తీజ్ ఉత్సవాల్లో ధర్మదీక్ష చేపట్టిన యువతులు

కృష్ణాపురంలో ఉత్సాహంగా తీజ్ ఉత్సవాలు

టి.నరసాపురం, ఆగస్టు 18: మండలంలోని కృష్ణాపురంలో బంజారా బజరంగీ భేరీ సంఘం ఆధ్వర్యంలో ఆదివారం తీజ్ ఉత్సవాలను ప్రారంభించారు. ఉత్సవాల్లో భాగంగా పది మంది యువతులు భూక్యా హిమజ, జరభల నాగమ్మ, లావుడియా భవాని, కనకమహాలక్ష్మి, దీపిక, నాగభవాని, తనుజ, హర్షిత దీక్ష చేపట్టారు. జిల్లా నాయకులు భూక్యా నాగరాజు నాయక్ మాట్లాడుతూ యువతులు జీవితంలో సమస్యలను ధైర్యంగా ఎదుర్కొంటూ ఆత్మస్థైర్యంతో ఎదిగేందుకు బంజారాలు తీజ్ పండుగను చేస్తారన్నారు. తొమ్మిది రోజుల పాటు బంజారా ఆడపిల్లలు ధర్మదీక్ష చేపట్టి పూర్వీకుల త్యాగాలను స్మరించుకుంటూ ఆట, పాటలతో ఉత్సాహంగా తీజ్ పండుగను చేసుకుంటారన్నారు. సంఘ ప్రధాన కార్యదర్శి వేణుగోపాల్ నాయక్ మాట్లాడుతూ పంటలు బాగా పండాలని, పశుసంపద బాగా పెరగాలని, గ్రామం సిరి సంపదలతో వెల్లి విరియాలని శ్రావణమాసంలో తీజ్ జరుపుతారని అన్నారు. ఉత్సవ కమిటీ జిల్లా నాయకులు శ్రీనివాస్ నాయక్ మాట్లాడుతూ ఆడపిల్లలు వెదురు బుట్టల్లో గోధుమ విత్తనాలు చల్లడంతో తీజ్ ఉత్సవం మొదలై 9వ రోజు గోధుమ మొలకలు బుట్టలను ఊరంతా ఊరేగించి చెరువులో నిమ్మజ్జనం చేయడంతో పండుగ పూర్తి అవుతుందన్నారు. కార్యక్రమంలో బూక్యా బిగనాథం, ధరావత్ రవి, జరభల పూర్ణయ్య, భద్రయ్య, బంగారు బాబు, సత్తిబాబు, భద్రమ్మ, అరుణ, భాగ్యలక్ష్మి, కృష్ణలీల, తదితరులు పాల్గొన్నారు.

దోమలు పెరగకుండా నీటిని శుభ్రపరుచుకోవాలి



నీటిపరీక్షలు చేస్తున్న వైద్య సిబ్బంది

లింగపాలెం, ఆగస్టు 18: ఇంటి పరిసరాల్లో మురుగునీరు నిల్వకుండా చూసుకోవాలని, మురుగులో దోమలు పెరిగి వ్యాధులు విజృంభిస్తాయని చింతలపూడి సబ్ యూనిట్ ఆఫీసర్ ఎన్.ప్రసాద్ అన్నారు. ఆసన్నగూడెంలో ఆదివారం వైద్య శిబిరం నిర్వహించారు. ఇళలో నీటిని వాడుకునే తొట్టెలు, కాలువలను ఆయన పరిశీలించారు. ప్రతిఒక్కరూ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని, గోరువెచ్చని నీటినే తాగాలన్నారు. దోమలు కుట్టకుండా దోమతెరలను వాడాలని ఆయన తెలిపారు. వైద్యసిబ్బంది ప్రతిరోజూ ఇంటింటా ఫీవర్ సర్వే నిర్వహించాలని, ఎవరికైనా వైద్యసహాయం అవసరమైతే ప్రభుత్వాసుపత్రికి తీసుకురావాలని అన్నారు. గ్రామాల్లో జ్వరాలు విజృంభిస్తున్న వేళ ప్రజలు డాక్టర్‌ను సంప్రదించాలని ఆయన తెలిపారు. కార్యక్రమంలో ఆయనతో పాటు శ్రీనివాస్, చంద్రశేఖర్, నాగదివ్య, రేణుక, పార్వతి, పలువురు వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

135 మందికి ఉచిత నేత్ర వైద్య పరీక్షలు

ఏలూరు కార్పొరేషన్, ఆగస్టు 18: రామకోటి ప్రాంగణంలో లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో ఆదివారం ఉచిత నేత్ర వైద్య శిబిరం నిర్వహించారు. వేమగిరికి చెందిన పరమహంస యోగానంద నేత్ర వైద్యశాల నిపుణులు 135 మంది కి కంటి పరీక్షలు నిర్వహించి జాగ్రత్తలను సూచించారు. 12 మందికి శస్త్ర చికిత్స అవసరమని నిర్ధారించారు. 26 మందికి దృష్టిలోపం ఉన్నట్టు గుర్తించి సబ్సిడీపై కళ్లజోళ్లు అందజేశారు. వైద్య శిబిరం వద్ద మానేపల్లి రామారావు, నల్లవల్లి చలపతిరావు, కంది బాలకృష్ణ, కుమార్, లక్ష్మీనారాయణ, టి.వి.సుబ్బారావు, మోహన్‌రావు, లక్ష్మీ నరసింహారావు, పిల్లి పండరీనాథ్, బొలిశెట్టి సురేష్‌కుమార్, చెన్న వెంకట్రామయ్య తదితరులు సేవలందించారు.

● ఏలూరు టూటౌన్: ఏఎస్ఆర్ స్టేడియం వాకర్స్ వెల్ఫేర్ అసోసియేషన్, వాసవి సుబ్బారావు సీతారాజ్యలక్ష్మి చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం ఆదివారం నిర్వహించినట్లు ఎస్ఎం.అక్బర్ తెలిపారు. డాక్టర్ అంబూరి రాఘవరావు వైద్యపరీక్షలు నిర్వహించారు. మహిళా అధ్యక్షురాలు అరుణ, జగదీశ్, నాగవిఘ్నేశ్, జంపా సూర్యనారాయణ, గొంతిన రామకృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

ఆర్‌అండ్‌బీ అధికారులపై చర్యలు తీసుకోవాలి



పనులు చేపట్టని రహదారి చూపుతున్న నేతలు

వేలేరుపాడు, ఆగస్టు 18: మండలంలో ఆర్‌అండ్‌బీ రహదారుల మరమ్మతు పనులకు మంజూరైన నిధులను బిల్లులు చేసుకుని అవినీతికి పాల్పడ్డారని ఆర్‌అండ్‌బీ అధికారులపై టీడీపీ మండల నాయకులు అమరవరపు అశోక్, కట్టం రాంబాబు తీవ్ర ఆరోపణలు చేశారు. ఈ మేరకు ఆదివారం ఒక ప్రకటన విడుదల చేశారు. 2022లో ఆర్‌అండ్‌బీ రహదారుల మరమ్మతులకు మండలానికి సుమారు రూ.కోటి మంజూరయ్యాయని, రహదారుల మరమ్మతు చేయాల్సి ఉండగా జంగారెడ్డిగూడెం ఆర్‌అండ్‌బీ డివిజన్ అధికారులు, వైసీపీ నాయకులు కుమ్మక్కై కొద్దిపాటి పనులు చేయించారన్నారు. వేలేరుపాడు ప్రధాన రహదారి మరమ్మతులు చేపట్టలేదన్నారు. కూటమి అధికారంలోకి వచ్చిన కొద్దిరోజులకే ఆర్‌అండ్‌బీ అధికారులు బినామీ కాంట్రాక్టర్‌ను రంగంలోకి దించి హడావుడిగా వేలేరుపాడు ప్రధాన రహదారి గుంతలను పూడ్చి తారు వేశారని, కొద్దిరోజులకే తిరిగి గుంతలమయంగా మారిందని ఆరోపించారు. ఈ పనులపై కలెక్టర్‌కు ఫిర్యాదు చేశామన్నారు. సీసీరోడ్లు వేసేందుకు ఇసుక, కంకరను స్టాకు పెట్టారే కానీ పనులు ప్రారంభించలేదని, 2022-23 సంవత్సరాల్లో బినామి కాంట్రాక్టర్లతో కుమ్మక్కై నిధులను దోచుకున్నారని, విచారణ నిర్వహించి చర్యలు తీసుకోవాలని టీడీపీ నాయకులు డిమాండ్ చేశారు.



రైతులకు తీవ్ర నష్టం

పొలాల్లో తరచు విద్యుత్ పరికరాలు అపహరిస్తున్నారు. రైతులు తీవ్రంగా నష్టపోతున్నారు. విద్యుత్, పోలీస్ అధికారులు నిఘా ఉంచి రైతులకు అండగా ఉండాలి.

కరేడి అశోక్, రైతు



వైర్ల చోరీ జరిగిన ప్రదేశం పరిశీలిస్తున్న రైతులు

రైతుకు దొంగల షాక్

వ్యవసాయ బోర్ల విద్యుత్ పరికరాలు అపహరణ

ఉంగుటూరు, ఆగస్టు 18: మండలంలోని మెట్టప్రాంత రైతులకు దొంగలు విద్యుత్ షాక్ ఇస్తున్నారు. వ్యవసాయ బోర్ల వద్ద విద్యుత్ పరికరాలు, వైర్లు అపహరించడంతో రైతులు లబోదిబోమంటున్నారు. నల్లమాడు గ్రామ ఆయకట్టులో బోర్ల వద్ద తరచు విద్యుత్ వైర్లు, పరికరాలు అపహరిస్తున్నారని రైతులు వాపోతున్నారు. గత నెల 30న ఒకేసారి ఆరు బోర్ల వద్ద విద్యుత్ తీగలతో పాటు, స్టార్టర్లు, ఇతర పరికరాలు ఎత్తుకుపోయారు. ఈ సంఘటనలపై బాధిత రైతులు చేబ్రోలు పోలీసులకు ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేశారు. తరచూ విద్యుత్ పరికరాల చోరీతో ఆర్థికంగా నష్ట పోతున్నామని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సమగ్ర విచారణ జరిపి రైతులకు న్యాయం చేయాలని కోరుతున్నారు.

వ్యవసాయ బోర్లకు సంబంధించి ట్రాన్స్‌ఫార్మర్ల వైరు అపహరణపై రైతులు జాగ్రత్తలు తీసుకోవాలని విద్యుత్ శాఖ ఏఈ వేణు సూచించారు. వేలాది రూపాయల విలువైన పరికరాలు పోవడం రైతులకు అదనపు భారమని, వారంతా సమష్టిగా చర్యలు తీసుకోవాలన్నారు.



రైతుకు భారం

విద్యుత్ పరికరాల చోరీతో వల్ల దొంగలకు వందల రూపాయలు వస్తాయేమో. రైతులు కొత్త పరికరాలు సమకూర్చుకోవాలంటే వేలాది రూపాయలు వెచ్చించాలి.

ఆచంట రాజకుమార్, రైతు



దుగ్గిరాలలో ప్రజల నుంచి వినతులు స్వీకరిస్తున్న ఎమ్మెల్యే చింతమనేని



స్కాలర్‌షిప్‌లు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే బడేటి చంటి

అర్హులైన పేదలకు మూడు సెంట్ల ఇంటి స్థలం

దెందులూరు, ఆగస్టు 18: కూటమి టీడీపీ ప్రభుత్వం అర్హులైన పేదలందరికి మూడు సెంట్ల ఇళ్ల స్థలాలను అందించనుందని ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్ అన్నారు. దుగ్గిరాలలో చింతమనేని క్యాంపు కార్యాలయంలో ఆదివారం ప్రజల నుంచి చింతమనేని ప్రభాకర్ వినతులను స్వీకరించారు. వైసీపీ ప్రభుత్వం జగనన్న కాలనీల పేరుతో పేద ప్రజలను మోసం చేసిందని నివాసయోగ్యం కానీ ప్రాంతాల్లో ఇళ్ల స్థలల సేకరణ పేరుతో కోట్ల రూపాయల ప్రభుత్వ సొమ్మును పక్కదారి పట్టించారన్నారు. టీడీపీ మండల అధ్యక్షుడు మాగంటి మిల్లుబాబు, బొప్పన సుధాకర్, లావేటి శ్రీనివాస్, నంబూరి నాగరాజు, తాతా సత్యనారాయణ, మోతుకూరి నాని పాల్గొన్నారు.

విద్యా దానం గొప్పది : ఎమ్మెల్యే బడేటి చంటి

ఏలూరు టూటౌన్: అన్ని దానాల్లోకి కెల్లా విద్యాదానం గొప్పదని ఎమ్మెల్యే బడేటి చంటి అన్నారు. ఏలూరు తూర్పుకాపు విద్యా విజ్ఞాన అభివృద్ధి సంఘం ఆధ్వర్యంలో విద్యార్థులకు స్కాలర్‌షిప్‌లను ఆదివారం ఆయన పంపిణీ చేశారు. ప్రతిభావంతులైన విద్యార్థులను ప్రోత్సహిస్తూ స్కాలర్‌షిప్‌లు అందించిన తూర్పుకాపు సంఘ నేతలను అభినందించారు. తూమరాడ సూర్య నారాయణ శాశ్వత విద్యానిధి పథకంలో 150 మంది విద్యార్థులకు రూ.3 లక్షల స్కాలర్‌షిప్‌లను అందజేశారు. పేద విద్యార్థులకు సహాయం చేయాల్సిన బాధ్యత సమాజంపై ఉందన్నారు. సంఘ అధ్యక్షుడు లంకా వెంకట రామ్మోహనరావు, ఎస్.రామారావు, ఎ.శ్రీనివాసరావు, ఏ.రామ్మోహనరావు, తూమరాడ స్రవంతి, పంకా ప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

తెలుగు సంస్కృతి చాటిచెప్పిన టీడీపీ

తెలుగు జాతి సంస్కృతిని ప్రపంచ దేశాలకు చాటి చెప్పిన ఘనత తెలుగుదేశం పార్టీదేనని ఎమ్మెల్యే బడేటి చంటి అన్నారు. స్కిల్ డెవలప్‌మెంట్‌లో 2018లో 15మంది ఉపాధ్యాయులను అప్పటి ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అమెరికా పంపించారన్నారు. ఐదేళ్లు అమెరికాలో చదువులు పూర్తి చేసుకుని ఏలూరు చేరుకున్న డాక్టర్ చార్లెస్ ఎమ్మెల్యే బడేటి చంటిని ఆదివారం కలిశారు. స్కిల్‌డెవలప్‌మెంట్ ద్వారా తనను అమెరికాకు పంపినందుకు చార్లెస్ కృతజ్ఞతలు తెలిపారు.

మహిళల భద్రతకు ఏపీఎన్జీవోల డిమాండ్

ఏలూరు అర్బన్, ఆగస్టు 18: కోల్‌కతాలో ట్రైనీ డాక్టర్‌పై జరిగిన హత్యాచారాన్ని ఖండిస్తున్నట్టు ఏపీ ఎన్జీవోల సంఘం ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లా శాఖ, మహిళా విభాగం నాయకులు వేర్వేరు ప్రకటనల్లో తెలిపారు. భవిష్యత్‌లో ఇటువంటి సంఘటనలు పునరావృతంకాకుండా మహిళల భద్రతకోసం ప్రత్యేక చట్టాలు చేయాలని, వాటి అమలుకు ప్రత్యేక యంత్రాంగాలను ఏర్పాటుచేయాలని డిమాండ్ చేశారు. త్వరితగతిన విచారణ పూర్తిచేసి హత్యోదంతానికి కారకులైనవారికి కఠినశిక్షలు పడేలా చూడాలని ఎన్జీవో సంఘ ఉమ్మడి జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు సీహెచ్.శ్రీనివాస్, ఎస్.రామారావు, మహిళావిభాగం సభ్యులు నాగమణి, నాగదేవి, కుసుమ కుమారి, సునీత, సత్యభారతి తదితరులు డిమాండ్ చేశారు.

ఫైళ్ల దగ్ధం ఘటనపై సమగ్ర విచారణ జరిపించాలి

ఏలూరు కార్పొరేషన్, ఆగస్టు 18: పోలవరం ప్రాజెక్టు పరిపాలనా కార్యాలయంలో ఫైళ్లు దగ్ధం చేసిన ఘటనపై సమగ్ర విచారణ జరిపించాలని సీపీఎం జిల్లా కార్యదర్శి ఎ.రవి డిమాండ్ చేశారు. ఆదివారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. ఈ ఘటనలో దోషులను కఠినంగా శిక్షించాలని, పోలవరం ప్రాజెక్టు భూముల సేకరణ, ఆర్‌ఆర్ ప్యాకేజీ పంపిణీలో అవకతవకలను బయట పెట్టాలని, నిర్వాసితులకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. ఫైళ్లు దగ్ధం చేసిన వారిని కఠినంగా శిక్షించాలన్నారు.

అవార్డు గ్రహీతకు సత్కారం

ఏలూరు రూరల్, ఆగస్టు 18: ఏలూరు మున్సిపల్ కార్పొరేషన్ ఇన్‌చార్జి ఈఈ తిలగల కొండలరావు ఉత్తమసేవా అవార్డు అందుకోవడం అభినందనీయమని జిల్లా యాదవ సంఘం నాయకులు అన్నారు. యాదవసంఘ భవనంలో మున్సిపల్ ఏఈ కొండలరావును ఆదివారం ఘనంగా సత్కరించారు. ప్రజా సమస్యలపై తక్షణం స్పందించి న్యాయం చేయాలనే సంకల్పం, చొరవ చూపించే అధికారులు అరుదుగా ఉంటారని, అటువంటి వారిలో కొండలరావు ప్రథమస్థానంలో నిలుస్తారని కొనియాడారు. ఇండోర్‌స్టేడియం, వాకర్స్ సభ్యులు కూడా ఘనంగా సత్కరించారు. యాదవసంఘం నాయకులు చిదరబోయిన శ్రీనివాసరావు, ఉక్కుసూరి గోపాలకృష్ణ, కిలారపు శ్రీనివాసరావు, గొర్ల రామారావు, బొట్టా అజయ్ తదితరులు పాల్గొన్నారు.

బాడీ బిల్డింగ్ పోటీ విజేతకు నగదు ప్రోత్సాహకం

ఏలూరు రూరల్, ఆగస్టు 18: పాలకొల్లులో ఇటీవల జరిగిన రాష్ట్రస్థాయి బాడీబిల్డింగ్ పోటీల్లో స్వర్ణపతకం సాధించి, మిస్టర్ ఆంధ్రా ట్రోఫీ కైవసం చేసుకున్న ఏలూరు తూర్పువీధికి చెందిన కొల్లిపర పూర్ణచంద్రరావుకు నగదు ప్రోత్సాహకం అందించారు. జాతీయస్థాయి పోటీల్లో పాల్గొనేందుకు రూ.12వేలు యాదవ సంఘం నాయకులు అందచేశారు. సంఘం నాయకులు గుడ్ల గౌరీశంకర్, పిలగల రెడ్డియ్య తదితరులు పాల్గొన్నారు.

ఏజెన్సీలో బస్సు సర్వీసులను పునరుద్ధరించాలి

బుట్టాయగూడెం, ఆగస్టు 18: ఏజెన్సీ ప్రాంతంలో జంగారెడ్డిగూడెం డిపో నిలుపుదల చేసిన బస్సు సర్వీసులను పునరుద్ధరించాలని గిరిజనులు కోరుతున్నారు. బుట్టాయగూడెం నుంచి పందిరిమామిడిగూడెం, బూరుగువాడ మీదుగా అంకన్నగూడెం వరకు నిలుపుదల చేసిన బస్సు సర్వీసు పునరుద్ధరించాలని పరిసర గ్రామాల గిరిజనులు కోరుతున్నారు. ట్రిప్పులు తగ్గించడం వలన పాఠశాల, కళాశాలల విద్యార్థులు, మండల కేంద్రం, కేఆర్ పురం ఐటీడీఏ, అత్యవసర పనులపై ఇతర ప్రాంతాలకు వెళ్లే గిరిజనులు, అమ్మవారి దర్శనానికి భక్తులు ఇబ్బందులు పడుతున్నట్లు స్థానిక సర్పంచ్ సత్యదుర్గాప్రసాద్, భీమయ్య, బూరుగువాడ, పందిరిమామిడిగూడెం, అంకన్నగూడెం గ్రామాలకు చెందిన గిరిజనులు తెలియజేశారు. ఉదయం 11, సాయంత్రం 3, రాత్రి 9 గంటలకు చెందిన ట్రిప్పులను నిలుపుదల చేశారని వాపోతున్నారు. గిరిజనుల ఇబ్బందులను గుర్తించి వెంటనే ట్రిప్పులను ఆర్టీసీ అధికారులు పునరుద్ధరించాలని కోరుతున్నారు.

వైద్యురాలి హత్యకు కారకులను శిక్షించాలి

కుక్కునూరు, ఆగస్టు 18: వైద్యురాలిపై అత్యాచారం, హత్యకు కారకులైన నిందితులను కఠినంగా శిక్షించాలని సీఐటీయూ మండల కార్యదర్శి సాయి కిరణ్ అన్నారు. ఆదివారం కుక్కునూరులో ఒక ప్రకటన విడుదల చేశారు. మహిళా చట్టాలను దేశంలో పటిష్టంగా అమలు చేయాలని వైద్యులకు రక్షణ కల్పించాలని ఆయన డిమాండ్ చేశారు. దేశంలో మహిళలకు భద్రత లేకుండా పోయిందని, కఠిన శిక్షలు అమలు చేయాల్సిన అవసరం ఉందన్నారు. సీపీఎం మండల కార్యదర్శి వై.నాగేంద్రరావు, వలీభాష, రమేష్ పాల్గొన్నారు.

● ఉంగుటూరు: కోల్‌కతాలో ట్రైనీ డాక్టర్‌పై హత్యాచారానికి నిరసనగా పీఎంపీ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆదివారం చేబ్రోలు పీహెచ్‌సీ వద్ద ర్యాలీ నిర్వహించారు. మండల అధ్యక్ష, కార్యదర్శులు, సభ్యులు పాల్గొన్నారు. ఇండియన్ మెడికల్ అసోసియేషన్ సభ్యులకు సంఘీభావం తెలిపారు.

ప్రభుత్వ న్యాయవాది నీలోత్సల్‌కు ఘన సన్మానం

దెందులూరు, ఆగస్టు 18: దెందులూరు గ్రామానికి చెందిన గంజి వెంకట్రావు, సువర్చలాదేవి దంపతుల కుమారుడు గంజి నీలోత్పల్ హైకోర్టులో ప్రభుత్వ సహాయ న్యాయవాదిగా ఎంపికయ్యారు. సుగ్గిశెట్టి నూకరాజు, గ్రామస్తులు నీలోత్పల్‌కు ఆదివారం అభినందన సభ నిర్వహించారు. విద్యార్థులు, గ్రామస్తుల న్యాయవాదిని ఘనంగా సన్మానించారు. ప్రభుత్వ న్యాయవాదిగా నీలోత్పల్ ఎంపిక కావడం దెందులూరుకు ఎంతో మంచిపేరు వచ్చిందన్నారు. న్యాయవాదులు, ఉపాధ్యాయులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తే చర్యలు

ఏలూరు క్రైం, ఆగస్టు 18: శాంతి భద్రతలకు విఘాతం కల్గిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని టూటౌన్ సీఐ వైవి రమణ అన్నారు. సీఐగా ఆదివారం ఉదయం బాధ్యతలు స్వీకరించారు. ప్రస్తుతం మచిలీపట్టణం ట్రాఫిక్ సీఐగా విధులను నిర్వర్తిస్తూ సాధారణ బదిలీల్లో భాగంగా ఏలూరు టూటౌన్‌కు నియమితులయ్యారు. గంజాయి, జూదాలపై కఠిన చర్యలు చేపడతామన్నారు. అల్లరి మూకలపై ప్రత్యేక నిఘా పెడతామని, నగరంలో మఫ్టీ పోలీసులతో గస్తీ నిర్వహిస్తామన్నారు. అనుమానస్పద వ్యక్తులు ఎవరైనా సంచరిస్తే వెంటనే 100 లేదా టూటౌన్ పోలీస్ స్టేషన్ ఫోన్ నెంబర్ 08812-230652కు సమాచారం అందించాలని సూచించారు. సీఐకు ఎస్ఐలు మదీనాబాషా, సాదిక్, రవితేజ, సిబ్బంది శుభాకాంక్షలు తెలిపారు.

ఒకరి రక్తదానంతో ముగ్గురికి ప్రాణదానం

ఏలూరు క్రైం, ఆగస్టు 18: ఒకరి రక్తదానం ముగ్గురి ప్రాణాలు కాపాడుతుందని ఎమ్మెల్యే బడేటి చంటి అన్నారు. ఈ నెల 22న మెగాస్టార్ చిరంజీవి జన్మదినం పురస్కరించుకుని అభిమానులు ఆదివారం రక్తదానం చేశారు. రెడ్‌క్రాస్ బ్లడ్ బ్యాంక్‌లో 25 మంది రక్తదానం చేశారు. ఎమ్మెల్యే చంటి మాట్లాడుతూ చిరంజీవి సేవా కార్యక్రమాలను ప్రతి ఒక్కరు స్ఫూర్తిగా తీసుకోవాలన్నారు. రెడ్‌క్రాస్ ఛైర్మన్ బీవీ కృష్ణారెడ్డి మాట్లాడుతూ ఎమ్మెల్యే చంటి రక్తదాతల్లో స్ఫూర్తిని నింపారని, రక్తదానం చేసిన చిరంజీవి అభిమానులకు అభినందనలు తెలిపారు. డాక్టర్ ఆర్ఎస్ఆర్‌కె వర ప్రసాదరావు, పిఆర్వో కెవి రమణ, చిరంజీవి ఫ్యాన్స్ అసోసియేషన్ సభ్యులు శానం శ్రీరామకృష్ణ, కట్టా ఆది, జనసేన నాయకులు నారా శేషు పాల్గొన్నారు.

వాహనదారులు హెల్మెట్ ధరించాలి

పెదపాడు, ఆగస్టు 18: వాహనదారులు హెల్మెట్ ధరించి సురక్షిత ప్రయాణం చేయాలని ఎస్సై కె.శుభశేఖర్ సూచించారు. కలపర్రు టోల్‌గేట్ వద్ద సిబ్బందితో కలిసి ఆదివారం వాహనాల తనిఖీ నిర్వహించారు. నిబంధనలు పాటించని వాహనదారులకు ఈ చలానా రూపంలో జరిమానాలు విధించారు. ట్రాఫిక్ నిబంధనలు పాటిస్తూ వాహనాలను నడపడం ద్వారా క్షేమంగా గమ్యం చేరుకోవచ్చన్నారు. అతివేగంగా, మద్యం సేవించి వాహనాలను నడపటం వల్ల కొన్నిసార్లు ప్రాణాపాయం కూడా కలుగవచ్చునన్నారు. తనిఖీల్లో స్టేషన్ సిబ్బంది పాల్గొన్నారు.



లింగపాలెంలో పాపన్న గౌడ్ విగ్రహం ఆవిష్కరించిన ఎమ్మెల్యే రోషన్



కూచింపూడిలో పాపన్నగౌడ్ జయంతి కార్యక్రమంలో నేతలు

మహోన్నతుల అడుగుజాడల్లో నడవాలి

లింగపాలెం, ఆగస్టు 18: మహోన్నతుల అడుగుజాడల్లో నడవాలని, సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ మహోన్నత వ్యక్తి, ధైర్యశాలి అని ఎమ్మెల్యే సొంగా రోషన్‌కుమార్ అన్నారు. పాపన్నగౌడ్ జయంతి సందర్భంగా లింగపాలెంలో గౌడ కులస్థులు ఏర్పాటుచేసిన సర్వాయి పాపన్నగౌడ్ విగ్రహాన్ని ఆదివారం ఎమ్మెల్యే ఆవిష్కరించారు. రాచరిక వ్యవస్థపై పాపన్నగౌడ్ ఎదురు తిరిగాడని, వారిని ఎదురించి గోల్కొండ కోటను జయించి శిస్తులను ఆపివేయించాడని రోషన్‌కుమార్ గుర్తు చేశారు. పేద ప్రజల సంక్షేమం కొరకు ఆయన శ్రమించాడని అన్నారు. అటువంటి మహోన్నత వ్యక్తి విగ్రహాన్ని ఆవిష్కరించడం తనకు ఎంతో ఆనందంగా ఉందన్నారు. సర్వాయి పాపన్న గౌడ్ ఒక కులానికే కాకుండా పేదల పక్షాన నిలిచిన వ్యక్తి అన్నారు. అనంతరం విగ్రహ దాతలైన కాసగాని రామారావు, కాసగాని వెంకటేశ్వరరావు, కాసగాని వెంకట సత్యనారాయణను ఆయన సన్మానించారు. తాళం సోంబాబు, దాసరి శ్యామ్‌చంద్రశేషు, జిజ్జూరి బాబ్జి, చిలకబత్తుల ప్రభాకర్‌రావు, నాయుడు మహేష్, పామర్తి వెంకటేశ్వరరావు, పామర్తి సత్యనారాయణ, చిలకబత్తుల వీరభద్రరావు, కాసగాని శివయ్య, తదితరులు పాల్గొన్నారు.

● దెందులూరు: సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ ఆశయాలకు అనుగుణంగా ప్రతి గౌడ బిడ్డ కృషి చేయాలని గౌడ సంఘం జిల్లా నాయకులు, టీడీపీ జిల్లా సంయుక్త కార్యదర్శి తాతా సత్యనారాయణ అన్నారు. కూచింపూడి లో పాపన్న గౌడ్ జయంతిని గౌడ సంఘం, టీడీపీ నాయకులు నిర్వహించారు. పాపన్న గౌడ్ విగ్రహానికి తాతా సత్యనారాయణ, నేతలు పూలమాల వేసి నివాళులర్పించారు. బొల్ల హనుమంతరావు, అయినాల శ్రీనివాసరావు, మారగాని శ్రీనివాసరావు, గౌడ సంఘం నాయకులు పాల్గొన్నారు.

● టి.నరసాపురం: బడుగు, బలహీనవర్గాల కోసం సర్వాయి పాపన్న పోరాటం చిరస్మరణీయమని నాయుడు రామకృష్ణగౌడ్ అన్నారు. టి.నరసాపురంలో పాపన్న జయంతిని ఘనంగా నిర్వహించారు. ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. బహుజన చక్రవర్తి పాపన్నను ప్రతిఒక్కరూ ఆదర్శంగా తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో గౌడ సంఘం నాయకులు మిడత పెంటయ్య తదితరులు పాల్గొన్నారు.

కుక్కల గుంపు



నగరంలో స్వైరవిహారం చేస్తున్న కుక్కలు

ఏలూరు నగరంలో కుక్కల గుంపులతో ప్రజలు బెంబేలెత్తిపోతున్నారు. బెడద నుంచి ప్రజలను కాపాడాలని డిమాండ్ చేశారు. నగరంలో పలుచోట్ల కుక్కలు స్వైర విహారంతో పాఠశాల విద్యార్థులు, వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. పాదచారులు, వాహనదారులను కుక్కలు పరుగులు పెట్టిస్తున్నాయి. కుక్కలు దాడి చేయడం ఎలా ఉన్నా వెంటపడి తరమడంతో వాహనదారులు ప్రమాదానికి గురవుతారని పలువురు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. స్కూల్ పిల్లల వెంట పడడడంతో స్కూల్‌బ్యాగ్‌ల బరువుతో విద్యార్థులు పరుగెత్తుతున్నారు. అమీనాపేటలో కుక్కలు గుంపులుగా చిన్నపిల్లలు, మహిళలు, వృద్ధులు సైకిల్, ద్విచక్రవాహనదారులను వెంబడించి పరుగు పెట్టిస్తున్నాయి. ప్రతిరోజూ ఏదోఒక చోట వీధికుక్కల బారినపడి గాయపడుతున్నారు. కుక్కల సంఖ్య పెరగకుండా ఉండేందుకు బర్త్‌కంట్రోల్ ఆపరేషన్లు నామమాత్రంగా జరుగుతున్నాయి. స్పెషల్‌డ్రైవ్ నిర్వహించి, ప్రత్యేక స్థలానికి తరలించి ప్రజల ప్రాణాలను కాపాడాల్సిందిగా నగర ప్రజలు కోరుతున్నారు. - ఏలూరు రూరల్ / టూటౌన్

రహదారి సమస్య పరిష్కారం



గుంతలు పూడ్చిన రహదారి

ఏలూరు రూరల్, ఆగస్టు 18: స్థానిక 16వ డివిజన్ అరుంధతిపేటలో గుంతలమయంగా మారిన రోడ్డు సమస్య ఎమ్మెల్యే బడేటి చంటి సహకారంతో పరిష్కారమైంది. అరుంధతిపేటవాసులు, వాహనదారులు ఇబ్బందులను టీడీపీ సీనియర్ నాయకులు యరకల సాంబశివరావు ఎమ్మెల్యే దృష్టికి తీసుకువెళ్లారు. ఎమ్మెల్యే స్పందించి రోడ్డు మరమ్మతులు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. రహదారి నిర్మాణానికి అధికారులు చర్యలు చేపట్టారు. దాదాపు 90శాతం రోడ్డునిర్మాణం పూర్తయింది. యెరకల సాంబశివరావు, స్థానికులు ఎమ్మెల్యే చంటికి అభినందనలు తెలిపారు. ఐదేళ్లుగా రహదారిని మరమ్మతులు చేయకుండా వైసీపీ నాయకులు నిర్లక్ష్యం చేయడంతో స్థానికులు అనేక అవస్థలు పడ్డారన్నారు. రహదారి ఏర్పాటు చేయడంపై గోళ్ళ చంటి, రామకృష్ణ, జగదీష్, యార్లగడ్డ మనోజ్ హర్షం వ్యక్తం చేశారు.

కాలువ పూడికతీతపై రైతుల హర్షం

లింగపాలెం, ఆగస్టు 18: గుర్రపుడెక్క, తూడు పేరుకుపోయి నీరందక రైతులు ఇబ్బందులు పడుతుండడంతో యడవల్లి సర్పంచ్ తట్టుబోయిన రమేష్ కాలువను పూడికతీయించారు. యడవల్లి నుంచి లింగపాలెం వరకు తమ్మిలేరు కాలువ పిచ్చి మొక్కలు, గుర్రపుడెక్కతో పూడిపోయింది. దిగువ భూములకు నీరందక రైతులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. రైతులు, సర్పంచ్ కట్టుబోయిన రమేష్, మోరంపూడి మల్లికార్జున్‌రావు దృష్టికి తీసుకువెళ్లడంతో వారు సొంత నిధులతో కాలువ పూడికతీత పనులను చేయించారు.

బైనేరు వంతెన నిర్మాణం త్వరగా పూర్తి చేయాలి

జంగారెడ్డిగూడెం, ఆగస్టు 18: పట్టణ శివారులో బైనేరు వంతెన నిర్మాణం, పక్కనే డంపింగ్ యార్డు సమస్యపై ఎంపీ పుట్టా మహేశ్, ఎమ్మెల్యే సొంగా రోషన్ కుమార్ స్పందించారు. వంతెన నిర్మాణం త్వరితగతిన పూర్తి చేయాలని కలెక్టర్‌కు లేఖ రాసినట్లు ఎంపీ పుట్టా మహేశ్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. డంపింగ్ యార్డు, వంతెన నిర్మాణ ప్రదేశాన్ని అధికారులు పరిశీలించి తగు చర్యలు తీసుకోవాలని కోరారు. వంతెన కూలిపోయి ఆరేళ్లు గడిచినా గత ప్రభుత్వం దృష్టి పెట్టలేదు. ఆర్‌అండ్‌బి నుంచి 2019లో నరసాపురం నుంచి అశ్వారావుపేట వరకూ మంజూరైన రోడ్డు పనుల్లో బైనేరు వంతెన నిర్మాణానికి సెంట్రల్ రోడ్ ఫండ్ (సిఆర్ఎఫ్) గ్రాంటు సుమారు రూ.4 కోట్లు మంజూరయ్యాయని, టెండర్ల ఖరారు, సాంకేతిక జాప్యంతో పనులు చేపట్టలేదన్నారు. టెండర్ల ప్రక్రియను త్వరలో పూర్తి చేసి నిర్మాణాన్ని త్వరగా ప్రారంభించాలని కలెక్టర్‌కు రాసిన లేఖలో కోరారు.

జ్యోతిష్య శాస్త్రంలో బాలకృష్ణకు డాక్టరేట్

ఏలూరు అర్బన్, ఆగస్టు 18: ఏలూరుకుచెందిన గుడిమెట్ల బాలకృష్ణ కిషోర్‌శర్మకు బెంగళూరులోని విశ్వవేద విద్యాపీఠ అంతర్జాతీయ విశ్వ విద్యాలయం, శివ యోగాశ్రమ్ ట్రస్ట్‌లు సంయుక్తంగా జ్యోతిష్య శాస్త్రంలో డాక్టరేట్‌ను అందజేశాయి. యూనివర్సిటీలో ఆదివారం నిర్వహించిన అంతర్జాతీయ జ్యోతిష్యశాస్త్ర పండిత సదస్సు సందర్భంగా బాలకృష్ణ కిషోర్‌శర్మకు నంద కిషోర్ పురోహిత్, ఉపకులపతి దివాకరన్, శ్రీరామానుజ గురుకుల జ్యోతిష్య శాస్త్ర పరిశోధనాకేంద్రం డైరెక్టర్ బద్రీనాథ్ డాక్టరేట్ అందజేశారు.

బాధిత కుటుంబానికి ఆర్థిక సహాయం

ఏలూరు కార్పొరేషన్, ఆగస్టు 18: ఏఐటీయూసీ అనుబంధ సంస్థ కార్మిక సంఘం ఏలూరు పట్టణ పొగాకు పనివార్ల సంఘం అధ్యక్షుడు జోగి నాగేశ్వరరావు ఇటీవల అనారోగ్యంతో మృతి చెందారు. ఏఐటీయూసీ జిల్లా ఉపాధ్యక్షుడు బండి వెంకటేశ్వరరావు తదితరులు ఆదివారం నాగేశ్వరరావు కుటుంబాన్ని పరామర్శించారు. రూ.25 వేల ఆర్థిక సహాయాన్ని అందజేశారు. నాయకులు పుప్పాల శ్రీనివాసరావు, చింతపల్లి కూర్మారావు, బరగడ పోతురాజు, నాగేశ్వరరావు, క్వాటు వెంకటేశ్వరరావు తదితరులు ఉన్నారు.

కూటమి నాయకులు ఐక్యంగా కృషి చేయాలి

కామవరపుకోట, ఆగస్టు 18: ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలు ప్రజలకు చేరువయ్యే క్రమంలో కూటమి నాయకులు, కార్యకర్తలు ఐకమత్యంగా ప్రజలతో మమేకం కావాలని మాజీ ఎమ్మెల్యే ఘంటా మురళీరామకృష్ణ, టీడీపీ మండల అధ్యక్షుడు కిలారు సత్యనారాయణ అన్నారు. పాతూరులో వారు మాట్లాడుతూ ప్రభుత్వ పథకాలు అర్హులకే అందాలన్నారు. సీఎం చంద్రబాబు ఇచ్చిన హామీలు ఒక్కొక్కటిగా అమలు చేస్తున్నారని, నాయకులు, కార్యకర్తల సహకారం అవసరమని వారు అభిప్రాయపడ్డారు.

విద్యార్థులకు నగదు ప్రోత్సాహకం

టి.నరసాపురం, ఆగస్టు 18: బండివారిగూడెం పాఠశాలలో 8వ తరగతి చదువుతున్న 10 మంది విద్యార్థులకు గ్రామానికి చెందిన నాళం నారాయణ కుమారుడు నాళం భరత్‌కుమార్ నగదు ప్రోత్సాహకాలు అందజేశారు. విద్యార్థికి రూ.వెయ్యి చొప్పున పది మందికి నగదు అందజేసినట్లు పాఠశాల హెచ్ఎం డి.బాజా ఆదివారం తెలిపారు. విద్యార్థులను ప్రోత్సహిస్తున్న దాతలను ఎంఈవో టి.రామ్మూర్తి అభినందించారు.

ఎంపీడీవోగా శ్రీదేవి బాధ్యతల స్వీకరణ

కామవరపుకోట, ఆగస్టు 18: ఎన్నికల ముందు ఇతర జిల్లాలకు బదిలీ అయిన ఎంపీడీవో తిరిగి తమ స్థానాలకు చేరుకున్నారు. ఎంపీడీవో కె.శ్రీదేవి కాట్రేనికోన మండలంలో ఎన్నికల విధులు నిర్వహించి అనంతరం కామవరపుకోటలో తిరిగి బాధ్యతలు స్వీకరించారు. ఇప్పటివరకు ఇక్కడ ఎంపీడీవోగా పనిచేసిన జంగం స్వర్ణభారతి నుంచి శ్రీదేవి బాధ్యతలు స్వీకరించారు.



తూడుతో నిండిన అన్నవరం పంట కాలువ

అందని సాగునీరు

తూడుతో నిండిన అన్నవరం బ్రాంచ్ పంటకాల్వ

ముదినేపల్లి, ఆగస్టు 18: మండలంలోని పలు గ్రామాల ఆయకట్టుకు సాగునీరందించే అన్నవరం బ్రాంచ్ పంటకాలువ పూర్తిగా తూడుతో నిండిపోయింది. దీంతో పీఎస్ఎస్ ఛానల్ నుంచి నీరు విడుదల చేసినప్పటికీ ఈ పంట కాలువలో నీటి ప్రవాహానికి తూటు కాడ ఆటంకంగా మారింది. దీంతో ఈ కాలువ కింద సాగులో ఉన్న వడాలి, అప్పారావుపేట, ముదినేపల్లి, అన్నవరం గ్రామాల పరిధిలోని వందలాది ఎకరాల్లో సార్వా వరి పైరుకు సకాలంలో నీరందటం లేదు. దీంతో వరి నాట్లు వేసేందుకు కూడా అవకాశం లేకుండాపోయింది. ఈ పంట కాలువను ఉపాధి పథకం కింద నామమాత్రంగా మరమ్మతులు చేయటం తప్ప ఇరిగేషన్ శాఖ ఆధ్వర్యంలో పూర్తిస్థాయిలో పూడిక, తూటుకాడ తొలగింపు కానీ సార్వా సీజన్‌కు ముందు జరగటం లేదు. దీంతో ఇరిగేషన్ అధికారులు అన్నవరం పంట కాలువలో పేరుకుపోయిన తూటుకాడను తొలగింపునకు వెంటనే చర్యలు తీసుకోవాలని రైతులు కోరుతున్నారు.



అన్నా నీ అనురాగం..

నేడు రక్షాబంధన్

ద్వారకాతిరుమల/ఏలూరు కార్పొరేషన్/ పాలకొల్లు అర్బన్/ ఆగస్టు 18 : శ్రావణ శుద్ధ పౌర్ణమి రోజున రాఖీ పండుగతో పాటు జంధ్యాల పౌర్ణమిని కూడా జరుపుకుంటారు. రాఖీ పండుగ నాడు సోదరుడు ఎంత దూరాన ఉన్నా సోదరి వద్దకు వెళ్ళి రాఖీ కట్టించుకుని పసుపు, కుంకుమలు అందజేస్తే ఏడాదంతా మంచి జరుగుతుందనే నమ్మకం. రాఖీ కట్టడం వల్ల తమ సోదరుడు తమకు ఎల్లప్పుడూ అండగా ఉంటారని నమ్ముతారు సోదరీమణులు. మార్కెట్‌లో రాఖీ విక్రయాలు పెద్ద ఎత్తున జరుగుతున్నాయి. వెండి రాఖీలు ఒక్కొక్కటి రూ. 250, రూ.300ల వరకూ ఉండగా వివిధ రకాల రాఖీలు రూ. 10 నుంచి రూ.100ల వరకూ మార్కెట్లో అందుబాటులో ఉన్నాయి. రాఖీ పండుగ సందర్భాన్ని పురస్కరించుకుని ఏలూరు ఎంపీ పుట్టా మహేష్‌కుమార్ ప్రజలకు శుభాకాంక్షలు తెలిపారు. అన్నచెల్లెళ్ళ అనుబంధానికి ప్రతీకగా రక్షాబంధన్ వేడుకలను జరుపుకోవాలని ఆకాంక్షించారు.

రాఖీ ఎప్పుడు కట్టాలి?

శాస్త్రాల ప్రకారం భద్రకాలంలో రాఖీ కట్టకూడదని పండితులు చెబుతున్నారు. భద్రకాలం ముగిసిన తర్వాతే రాఖీ కట్టాలి. జ్యోతిష్యం ప్రకారం రాఖీ పౌర్ణమి వేళ మూడు శుభయోగాలు ఏర్పడనున్నాయి. సర్వార్థ సిద్ధి యోగం, శోభన్ యోగం, రవియోగం వంటివి ఏర్పడతాయని వారు చెబుతున్నారు. ఈ ఏడాది సోమవారం ఉదయం శ్రావణ మాసం శుక్లపక్షంలో పౌర్ణమి తిథి తెల్లవారుజామున 3.04 గంటలకు ప్రారంభమవుతుంది. అదే రోజు రాత్రి 11-55 కు ముగుస్తుంది. ఈ నేపథ్యంలో పంచాంగం ప్రకారం భద్రకాలం ఉదయం 05.53 గంటలకు ప్రారంభమై మధ్యాహ్నం 01.32 వరకూ ఉంటుంది. భద్రకాలం ముగిసిన తర్వాత సోదరీమణులు రక్షాసూత్రాన్ని తమ సోదరుని మణికట్టుపై కట్టవచ్చు. సోమవారం మధ్యాహ్నం ఒంటి గంటా 46 నిమిషాల నుంచి రాత్రి 10 వరకూ శుభసమయం ఉందని పండితులు చెబుతున్నారు.

చిరంజీవి యువత సంయుక్త కార్యదర్శిగా సుధీర్



నూజివీడు టౌన్, ఆగస్టు 18: ఉమ్మడి కృష్ణా జిల్లా చిరంజీవి యువత సంయుక్త కార్యదర్శిగా సత్రపు సుధీర్‌ను ఎంపిక చేస్తూ చిరంజీవి అభిమాన సంఘాల గౌరవాధ్యక్షుడు కొణిదెల నాగేంద్రబాబు (నాగబాబు), చిరంజీవి యు వత అఖిల భారత ఉపాధ్యక్షుడు కృష్ణ ప్రసాద్ ఆదేశాలు జారీ చేశారు. చిరంజీవి యువత అధ్యక్షుడిగా గత మూడేళ్లుగా సుధీర్ పని చేస్తున్నారు. రక్తదాన శిబిరాలు, వివిధ కార్యక్రమాల నిర్వహణలో సుధీర్ ముందంజలో ఉన్నారు.

లంక గ్రామాలకు బస్సులు నడపరూ..

కలిదిండి, ఆగస్టు 18 : జిల్లాకు శివారున ఉన్న లంక గ్రామాలైన పెదలంక, పెదపుట్లపూడి, అప్పారావుపేట, మూల్లంక గ్రామాలకు నర్సాపురం, మచిలీపట్నం డిపో బస్సులను ఏర్పాటు చేయాలని ప్రజలు కోరుతున్నారు. ఆయా గ్రామాల నుంచి నిత్యం విద్యార్థులు నర్సాపురం, బంటుమిల్లి, మచిలీపట్నం కళాశాలలకు వెళ్లి వస్తుంటారు. బస్సులు లేకపోవటంతో 9 కిలోమీటర్ల మేర నడిచి వెళ్లి గరిసెపూడి అండర్ టన్నెల్ వద్ద బస్సులు ఎక్కుతున్నారు. దీంతో సమయానికి విద్యార్థులు కళాశాలకు వెళ్లలేకపోతున్నారు. వర్షం వస్తే దుమ్మా కొడుతున్నారు. నిత్యం రోగులు మచిలీపట్నం ప్రభుత్వాసుపత్రికి వెళ్లి వస్తుంటారు. లంక గ్రామాలకు 9 కిలోమీటర్ల మేర దూరంలో ఒంగోలు - కత్తిపూడి జాతీయ రహదారి ఉండటంతో నిత్యం నర్సాపురం నుంచి మచిలీపట్నం, మచిలీపట్నం నుంచి నర్సాపురం రాకపోకలు సాగిస్తుంటారు. జాతీయ రహదారికి 9 కిలోమీటర్ల మేర పెదలంక వరకు నూతనంగా బీటీ రోడ్డు నిర్మించారు. ప్రస్తుతం ఈ రహదారిపై పలు వాహనాలు రాకపోకలు సాగిస్తున్నాయి. గత ఐదేళ్లుగా నర్సాపురం, మచిలీపట్నం బస్సులను లంక గ్రామాలకు ఏర్పాటు చేయాలని పలుమార్లు పాలకులకు విన్నవించినా పట్టించుకోలేదని ప్రజలు ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత ఉన్నతాధికారులు స్పందించి లంక గ్రామాలకు బస్సులు ఏర్పాటు చేయాలని కోరుతున్నారు.

పేకాట శిబిరంపై దాడి.. ముగ్గురి అరెస్ట్

ముసునూరు, ఆగస్టు 18: నాగేంద్రపురం సెంటర్‌లో ఆదివారం పేకాట శిబిరంపై ఎస్ఐ పి.వాసు తన సిబ్బందితో దాడి చేసి ముగ్గురు జూదరులను అదుపులోకి తీసుకున్నారు. వారి నుంచి రూ. 14,400 నగదు స్వాధీనం చేసుకుని, కేసు నమోదు చేసినట్లు తెలిపారు.



ముదినేపల్లిలో నిర్మానుష్యంగా ప్రధాన రహదారి

సన్ డే

వేసవిని తలపించిన ఎండ ● అల్లాడిన జనం

ముదినేపల్లి మండలంలో ఎండ వేడిమి తీవ్రంగా ఉంది. ఉదయం 10 గంటల నుంచి భానుడి ప్రతాపంతో ప్రజలు అల్లాడిపోయారు. ముదినేపల్లిలోని జాతీయ రహదారితోపాటు పలు ప్రధాన రహదారులు ఉదయం నుంచే నిర్మానుషంగా మారాయి. దుకాణాలను సాయంత్రం 4 గంటల వరకు తెరవలేదు.

-ముదినేపల్లి



చాట్రాయిలో గిడ్డంగుల నిర్మాణానికి ప్రతిపాదించిన స్థలం

గిడ్డంగుల నిర్మాణం కలేనా..?

- 2008లో స్థలం కేటాయింపు
- నిధులు రాక అటకెక్కిన నిర్మాణం
- ధాన్యం నిల్వ చేయలేక నష్టపోతున్న రైతులు

చాట్రాయిలో వ్యవసాయ మార్కెట్ కమిటీ గిడ్డంగుల నిర్మాణం కలగానే మిగిలింది. తుఫానులు, అధిక వర్షాలు వచ్చినప్పుడు పంటలను భద్రపర్చుకోవటానికి గిడ్డంగుల సౌకర్యం లేక రైతులు తీవ్రంగా నష్టపోతున్నారు. సుమారు 25 ఏళ్లుగా గిడ్డంగులు నిర్మించాలని రైతులు కోరుతుండగా ఇంత వరకు అది కార్యరూపం దాల్చలేదు.

చాట్రాయి, ఆగస్టు 18: చాట్రాయిలో వ్యవసాయ గిడ్డంగుల నిర్మాణానికి 2008లో తిరువూరు వ్యవసాయ మార్కెట్ కమిటీ ఛైర్మన్‌గా దేశిరెడ్డి రాఘవరెడ్డి ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపారు. ఇందు కోసం చాట్రాయి- నరసాపురం రహదారి పక్కన ఒక ఎకరం భూమి కూడా కేటాయించారు. అయితే ప్రభుత్వం నిధులు కేటాయించకపోవటంతో నిర్మాణం అటకెక్కింది. పంటలు నిల్వ చేసుకొని అవకాశం లేకపోవటంతో రైతులు కల్లాల మీదే తక్కువ ధరకు ప్రైవేటు వ్యాపారులకు తెగనమ్ముకుని నష్టపోతున్నారు. అదే వ్యవసాయ మార్కెట్ కమిటీ గిడ్డంగులు అందుబాటులో ఉంటే పంటలను వాటిలో నిల్వ చేసుకొని మంచి ధర వచ్చినప్పుడు అమ్ముకునే సౌకర్యం ఉంటుంది. పంట హామీపై రైతులు రుణాలు కూడా తీసుకోవచ్చు. నూజివీడు ఎమ్మెల్యే, గృహ నిర్మాణశాఖ మంత్రి కొలుసు పార్థసారథి చాట్రాయిలో వ్యవసాయ మార్కెట్ కమిటీ గిడ్డంగుల నిర్మాణానికి చర్యలు తీసుకోవాలని రైతులు కోరుతున్నారు.

గిడ్డంగులు లేక నష్టపోతున్నాం



మండల కేంద్రం చాట్రాయిలో వ్యవసాయ మార్కెట్ కమిటీ గిడ్డంగులు లేక నష్టపోతున్నాం. ఖరీఫ్, రబీ సీజన్లలో పంటలు కల్లాలపై ఉండగా వర్షాలు వచ్చి తరుచూ కోలుకోలేని దెబ్బ తింటున్నాం. పంటలు నిల్వ చేసుకొనే అవకాశం లేక తక్కువ ధరలకు అమ్ముకోక తప్పటం లేదు. ఇప్పటికైనా ప్రభుత్వం చాట్రాయిలో గిడ్డంగులు నిర్మాణానికి చర్యలు తీసుకోవాలి.

- ఇజ్జిగాని వెంకటేశ్వరరావు, రైతు, అరుగొలనుపేట.



తుమ్మగూడెంలో పాపన్న విగ్రహాన్ని ఆవిష్కరించిన గౌడ నాయకులు



కైకలూరులో పాపన్న గౌడ్ చిత్రపటానికి గౌడ నేతల నివాళి

సర్దార్ పాపన్న గౌడ్‌కు ఘన నివాళి

చాట్రాయి, ఆగస్టు 18: మండలంలోని తుమ్మగూడెంలో సర్దార్ సర్వాయి పాపన్న మహారాజ్ గౌడ్ విగ్రహాన్ని ఆదివారం జై గౌడ సేన రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ నంగెడ్ల రంగారావు గౌడ్, రాష్ట్ర కోశాధికారి కాసాని గాంగేయుడు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా జరిగిన సమావేశంలో వక్తలు మాట్లాడుతూ సాధారణ గీత కార్మిక కుటుంబంలో జన్మించిన పాపన్న తెలంగాణ గడ్డపై మొగల్ నిరంకుశ పాలనను ఎదిరించి పీడిత ప్రజలను ఏకం చేసి బహుజన రాజ్యాన్ని స్థాపించారన్నారు. గౌడ వర్గీయులు పాపన్న మహారాజ్ గౌడ్‌ను ఆదర్శంగా తీసుకొని ఐక్యంగా పోరాడి రాజ్యాధికారం సాధించుకోవాలని పిలుపునిచ్చారు. గౌడ సంఘం నాయకులు డాక్టర్ పానుగంటి శివన్నారాయణ, కందుల కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

కైకలూరు: సర్వాయి పాపన్న గౌడ్ మహరాజ్ జయంతిని కైకలూరులో ఘనంగా నిర్వహించారు. ఆదివారం తాలూకా సెంటర్‌లో ఆయన చిత్రపటానికి నియోజకవర్గ గౌడ సంఘం అధ్యక్షుడు పోలగాని నాగరాజు, బార్ అసోసియేషన్ మాజీ అధ్యక్షుడు ఎంవీవీ సత్యనారాయణ ఆధ్వర్యంలో పూల మాలలు వేసి నివాళులర్పించారు. ఆయన సేవలను కొనియాడారు. గౌడ సం ఘం ప్రధాన కార్యదర్శి బొల్లా శ్యామలరాజు గౌడ్, మారగాని గణపతి, దాసరి శ్రీనివాసరావు, పడమటి వాసు, పరసా సూర్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.



శ్మశానవాటికలో పనులు ప్రారంభిస్తున్న టీడీపీ నాయకులు

శ్మశాన వాటికలో జంగిల్ క్లియరెన్స్

సమస్యల పరిష్కారానికి మంత్రి చొరవ

ముసునూరు, ఆగస్టు 18: మండలంలోని గోపవరం పంచాయతీ శివారు పెదపాటివారిగూడెంలోని ఎస్సీ శ్మశాన వాటికలో తుప్పల తొలగింపు పనులను ఆదివారం టీడీపీ నాయకులు ప్రారంభించారు. ఐదేళ్ళ వైసీపీ పాలనలో శ్మశాన వాటికలు అభివృద్ధికి నోచుకోక చిట్టడవులను తలపిస్తున్న నేపథ్యంలో నూజివీడు ఎమ్మెల్యే, రాష్ట్ర గృహనిర్మాణ శాఖ మంత్రి కొలుసు పార్థసారథి చొరవతో శ్మశాన వాటికల్లో జంగిల్ క్లియరెన్స్ పనులు చేపట్టారు. టీడీపీ నాయకులు ఉప్పలపాటి గణేష్, వడ్లపట్ల మురళీ, సాయిల్ అనిల్, చిలకంటి శేషు తదితరులు కొబ్బరి కాయ కొట్టి ఎక్స్‌కవేటర్‌తో పనులను ప్రారంభించారు. గోపవరంలో సమస్యలను ఇటీవల మంత్రి పార్థసారథి దృష్టికి తీసుకువెళ్లడంతో సమస్యల పరిష్కారానికి వనసంరక్షణ శాఖ నుంచి నిధులు కేటాయించారని గణేష్ తెలిపారు. ఎస్సీ, బీసీ, ఓసీ వర్గాలకు చెందిన అన్ని స్మశానవాటికల్లో జంగిల్ క్లియరెన్స్ పనులు ముమ్మరంగా జరుగుతున్నాయని తెలిపారు. అలాగే ఎస్సీ, బీసీ కాలనీల్లో అంతర్గత రహదారులు, డ్రైనేజీల అభివృద్ధికి, రెండు నూతన మంచినీటి సరఫరా ట్యాంకుల నిర్మాణానికి ఇప్పటికే సంబంధిత అధికారులు మంత్రి పార్థసారథి ఆదేశాల తో ప్రతిపాదనలు తయారు చేసినట్టు గణేష్ తెలిపారు.

నేడు శ్రీకృష్ణ మందిరం పునః ప్రతిష్ఠ



శ్రీకృష్ణుడు, సీతారాముల విగ్రహాల ఊరేగింపు

మండవల్లి, ఆగస్టు 18: మండవల్లిలోని శ్రీకృష్ణ మందిరం పునఃప్రతిష్ఠ మహోత్సవాలు ఆదివారం వైభవంగా ప్రారంభమయ్యాయి. యాదవ సంఘం ఆధ్వర్యంలో పునఃనిర్మాణం చేపట్టిన శ్రీకృష్ణ మందిరంలో శ్రీకృష్ణుడు, సీతారాముల విగ్రహాలను సోమవారం ఉదయం ప్రతిష్ఠించనున్నట్టు ఆలయ కమిటీ తెలిపింది. ఆదివారం హోమాలు, పూజలు నిర్వహించి విగ్రహాలను ఊరేగించారు. యాదవ సంఘం ప్రముఖులు భారీ సంఖ్యలో పాల్గొన్నారు.

ఘనంగా గంగానమ్మ జాతర

ముదినేపల్లి, ఆగస్టు 18 : మండలంలో గంగానమ్మ జాతర మహోత్సవాలు వైభవంగా జరిగాయి. ముదినేపల్లిలో గౌడ, రజక సంఘాల ఆధ్వర్యంలో గంగానమ్మ జాతర వైభవంగా జరిగింది. మహిళలు పెద్దయెత్తున తరలివచ్చి గంగానమ్మ ఆలయంలో పూజలు జరిపి తమ మొక్కులు తీర్చుకున్నారు. వడాలి, పెదగొన్నూరు, సింగరాయపాలెం, అల్లూరు తదితర గ్రామాల్లో కూడా గంగానమ్మ జాతర నిర్వహించారు.

రాఖీల సందడి

ముదినేపల్లి, ఆగస్టు 18: ముదినేపల్లిలో ఆదివారం రాఖీల సందడి నెలకొంది. సోమవారం రక్షా బంధన్ సందర్భంగా తమ సోదరులకు రాఖీలు కట్టేందుకు పలువురు యువతులు, మహిళలు ఉత్సాహంగా రాఖీలను కొనుగోలు చేశారు. ముదినేపల్లిలో ఏర్పాటు చేసిన పలు దుకాణాల వద్ద రాఖీ ఒక్కింటికి రూ.10 నుంచి 100 రూపాయల వరకు ధర పలికింది. వీటితోపాటు మిఠాయి దుకాణాలు రద్దీగా మారాయి. రాఖీలు కట్టి సోదరులకు స్వీట్లు తినిపించే ఆనవాయితీ ఉన్నందున మిఠాయి దుకాణాలు కళకళలాడాయి.



ముదినేపల్లిలో ఈ ఏటీఎం వద్దే చోరీకి విఫలయత్నం

ఏటీఎంలకు రక్షణేదీ?

సెక్యూరిటీ సిబ్బందిని ఏర్పాటు చేయని బ్యాంకులు

ఇటీవల ముదినేపల్లిలో దోపిడీకి విఫలయత్నం

ముదినేపల్లి, ఆగస్టు 18 : ఏటీఎంలకు భద్రత లేకుండాపోయింది. భద్రత కల్పించాల్సిన బ్యాంకర్లు ఏటీఎంలకు సెక్యూరిటీ ఏర్పాటు చేసే బాధ్యతను పక్కన పెట్టేశారు. ఏటీఎంలకు భద్రతా ఏర్పాట్ల బాధ్యత బ్యాంకు అధికారులదేనని పోలీసు ఉన్నతాధికారులు స్పష్టం చేస్తున్నప్పటికీ పట్టించుకోవటం లేదు. ఈ నెల 14వ తేదీ తెల్లవారుజామున ముదినేపల్లిలోని ఓ ప్రైవేట్ బ్యాంక్ ఏటీఎం పగులగొట్టేందుకు విఫలయత్నం చేశారు. సెక్యూరిటీ గార్డును నియమించనందునే దుండగులు దోపిడీకి తెగించారు. గతంలో ప్రతి బ్యాంక్ ఏటీఎం వద్ద సెక్యూరిటీ గార్డును సంబంధిత బ్యాంక్ అధికారులు ఏర్పాటు చేసేవారు. ఇప్పటికీ పట్టణాలు, నగరాల్లో ప్రభుత్వ, ప్రైవేట్ బ్యాంకుల ఏటీఎంల వద్ద సెక్యూరిటీ గార్డులు ఉండగా, గ్రామీణ ప్రాంతాల ఏటీఎంల వద్ద గార్డులు లేరు. ముదినేపల్లి మండలంలో 5 ఏటీఎంలు ఉండగా, ఏ ఒక్క ఏటీఎం వద్ద కూడా సెక్యూరిటీ గార్డులు లేరు.

సాయం పేరుతో మోసాలు

ఏటీఎంల వద్ద భద్రతా సిబ్బంది లేకపోవటంతో వృద్ధులు, మహిళలను సాయం పేరుతో కొందరు మోసం చేస్తున్నారు. గతంలో సెక్యూరిటీ గార్డులు అనుమానాస్పద వ్యక్తులు వస్తే ఏటీఎం లోపలే ఉండి అంతా గమనించేవారు. ఇప్పుడు సిబ్బంది లేకపోవటంతో ఏటీఎం నుంచి సొమ్ము డ్రా చేసే ప్రక్రియ తెలియని వారు మోసగాళ్ల బారిన పడుతున్నారు. ఏటీఎంల్లో ఏర్పాటు చేసిన సిసి కెమెరాలు కూడ పలు చోట్ల పని చేయటం లేదు.

నోటీసులిచ్చాం..

ముదినేపల్లిలోని యాక్సిక్ బ్యాంక్ ఏటీఎంలో ఈ నెల 14వ తేదీ తెల్లవారుజామున చోరీ యత్నం జరిగిన నేపథ్యంలో మండలంలోని అన్ని బ్యాంకుల ఏటీఎంల వద్ద సెక్యూరిటీ గార్డులను ఏర్పాటు చేసుకోవాలని బ్యాంకల మేనేజర్లకు నోటీసులు ఇచ్చినట్టు ముదినేపల్లి ఎస్ఐ వెంకట్ కుమార్ తెలిపారు. ఏటీఎంల భద్రత బాధ్యత బ్యాంక్ అధికారులదేనన్నారు.

రైలింగ్ ఊడి.. బీటలు వారి..

ఆలపాడు జువ్వకనుమల డ్రెయిన్‌పై ప్రమాదకరంగా వంతెన

నిత్యం వేలాది మంది ప్రయాణించే మార్గంలో ఉన్న వంతెన శిథిలావస్థకు చేరడంతో ఆ వంతెనపై ప్రజలు బిక్కుబిక్కుమంటూ రాకపోకలు సాగిస్తున్నారు. ఈ మార్గం గుండా కొల్లేరు ప్రజలే కాక పెద్దింటి అమ్మవారిని దర్శించుకునేందుకు భక్తులు నిత్యం వస్తూనే ఉంటారు. కైకలూరు మండలం ఆలపాడులో జువ్వకనుమల డ్రెయిన్‌పై వంతెన అధ్వానంగా ఉంది. వంతెనకు ఇరువైపులా రైలింగ్ దెబ్బతినడమే కాక, గోడలు బీటలు వారి ప్రమాదస్థితికి చేరారు. దశాబ్దాల కాలం నాడు నిర్మించిన వంతెన కావడం, కనీస మరమ్మతులు కూడా నిర్వహించకపోవడంతో ఈ దుస్థితి నెలకొంది. వంతెన వద్ద దట్టమైన చెట్లు ఏర్పడడం, బీటలు వారడంతో ప్రమాదం పొంచి ఉందని భక్తులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. అధికారులు ఇప్పటికైనా స్పందించి వంతెనకు కనీస మరమ్మతులు నిర్వహించాలని కోరుతున్నారు.

-కైకలూరు



జువ్వకనుమల డ్రెయిన్‌పై శిథిల వంతెన (ఇన్‌సెట్) వంతెనపై బీటలు



చిన్నంపేటలో నేతాజీ చిత్రపటం వద్ద గ్రామస్థుల నివాళి

నేతాజీకి ఘన నివాళులు

చాట్రాయి, ఆగస్టు 18: దేశ స్వాతంత్ర్యం కోసం అలుపెరగని పోరాటం చేసి బ్రిటిష్ వారిని గడగడలాడించిన మహా యోధుడు నేతాజీ అని వక్తలు కొనియాడారు. నేతాజీ వర్ధంతిని పురస్కరించుకుని ఆదివారం చిన్నంపేటలో ఆయన చిత్రపటానికి పలువురు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అలాగే కోల్‌కతలో వైద్యురాలిపై హత్యాచారం ఘటనలో దోషులను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. వ్యవసాయ కార్మిక సంఘం మండల కార్యదర్శి కొమ్ము ఆనందం, స్థానిక నాయకులు కె. మహేష్, వెంకటేశ్వరరావు, నాగమణి గ్రామస్థులు పాల్గొన్నారు.



తాడినాడలో గ్రామస్థులతో లక్ష్మీనారాయణ

తాడినాడను సందర్శించిన లక్ష్మీనారాయణ

కలిదిండి, ఆగస్టు 18 : ఆదర్శ గ్రామం తాడినాడను సీబీఐ విశ్రాంత జేడీ లక్ష్మీనారాయణ ఆదివారం సందర్శించారు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ రాష్ట్రంలో ఆదర్శ గ్రామాలపై సర్వే చేస్తున్నామని, అందులో భాగంగా తాడినాడను సందర్శించానన్నారు. తాడినాడ గ్రామాభివృద్ధికి దాతలు ముందుకు రావటం అభినందనీయమన్నారు. జన్మభూమి స్ఫూర్తితో గ్రామాల అభివృద్ధికి దాతలు సహకరించాలన్నారు. రాష్ట్ర చేపల రైతుల సంఘం అధ్యక్షుడు తాడినాడ బాబు, సర్పంచ్ తాటి శ్రీనివాసరావు, పెన్మెత్స రాము, కొత్తపల్లి రామకృష్ణంరాజు, నంబూరి లచ్చిరాజు, బోసు మాస్టారు, పాండురంగారావు, చిలక రామరాజు తదితరులు పాల్గొన్నారు.

కార్మిక హక్కుల సాధనకు పాటుపడిన 'కొరారి'



నూజివీడు టౌన్, ఆగస్టు 18: అసంఘటిత రంగ కార్మికులను ఐక్యం చేసి వారి హక్కుల సాధ నకు పాటుపడిన కార్మిక నేత కొరారి నరసింహా రావు అని వక్తలు కొనియాడారు. ఏఐటీయుసీ రాష్ట్ర నాయకుడు నరసింహారావు వర్ధంతిని పురస్కరించుకుని కార్మిక భవన్ లో ముఠా వర్కర్స్ యూనియన్ అధ్యక్షుడు శ్రీనివాసరావు అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ఏఐటీయుసీ రాష్ట్ర గౌరవ అధ్యక్షుడు రాధా కృష్ణమూర్తి, హమాలి వర్కర్స్ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎస్. వెంకట సుబ్బయ్య, రాష్ట్ర గౌరవాధ్యక్షుడు చలసాని వెంకట రామారావు, సీపీఐ జిల్లా కార్యదర్శి మన్నవ కృష్ణ తదితరులు నరసింహారావు విగ్రహానికి పూల మాల వేసి నివాళులర్పించారు. కార్మికుల హక్కులను కాలరాసే యత్నాలను కేంద్రం మానుకోవాలన్నారు.

